ప్రజాశక్తి

శుక్రవారం 9 మే 2025 8 పేజీలు

గుంటూరు పల్నాడు

రాజధానిలో నిలిచిన భూ విక్రయాలు

అమరావతి పరిసరాల్లో పూర్తిగా మందగించిన లావాదేవీలు - అదనపు సమీకరణతో అయోమయం

అమరావతి మండలంలో గ్రామసభలకు హాజరైన రైతులు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

రాజధాని నిర్మాణం వేగం పుంజుకోవడం వల్ల తమ భూములకు మంచి ధరలు వస్తాయని ఆశించిన భూ సమీకరణ రైతులకు నిరాశ మిగిలింది. రాజధాని గ్రామాల్లో గత రెండు నెలల కాలంలో భూ విక్రయాలు మందగించాయి. కొనుగోలుకు ఇతర ప్రాంత వాసులు ముందుకు రావడం లేదు. అంతేగాక రెండో విడత భూ సమీకరణకు ప్రభుత్వం ముమ్మర కసరత్తు చేస్తుండటంతో రాజధాని గ్రామాలకు వచ్చే కొనుగోలు దారుల సంఖ్య పూర్తిగా తగ్గిపోయింది. రాజధాని గ్రామాల్లో భూ సమీకరణలో భూములు ఇచ్చిన రైతులు గజం కనీష్ఠంగా రూ.50 వేలు, గరిష్టంగా రూ.80 వేల వరకు చెబుతూ వచ్చారు. గత మార్చి నెలకు ముందు ఈ ధరలకు కొన్ని లావాదేవీలు జరిగాయి.

అయితే రెండో విడత భూ సమీకరణకు ప్రభుత్వం సిద్ధం కావడంతో రాజధాని గ్రామాల్లో ఒక్కసారిగా లావాదేవీలు నిలిచిపోయాయి రెండో విడత మరో 44 వేల ఎకరాలను కూడా రాజధాని అవసరాలకు భూ సమీకరణకు తీసుకుంటున్నారని తెలియడంతో జిల్లా అంతటా కొనుగోలు దారుల్లో గందరగోళం నెలకొంది. 44 వేల ఎకరాల భూమి కోసం తుళ్లూరు మండలం వడ్డమాను, హరిశ్చంద్రపురం, పెదపరిమితో పాటు అమరావతి మండలం వైకుంఠపురం, యండ్రాయి, పెదమద్దూరు, కర్లపూడి గ్రామాలను ఇప్పటికే ఎంపిక చేశారు. ఇప్పటికే అమరావతి మండంలోని నాలుగు గ్రామాలను ఒక యూనిట్‌గా మొత్తం 9600 ఎకరాలను రెండో విడత పూలింగ్‌లో మొదటిదశ సమీకరణకు నిర్ణయించారు. ఈ మేరకు నాలుగు గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించారు. రైతుల నుంచి సానుకూలతను తీసుకున్నారు. పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ రైతులకు భరోసాగా ఉండి గ్రామసభలను నిర్వహించారు. వడ్డమాను, హరిశ్చంద్రపురం, పెదపరిమి గ్రామాల్లో సమీకరణ సభలు నిర్వహిస్తామని అధికారులు తెలిపారు. మూడో విడత తాడికొండ మండలంలోని మరో నాలుగు, పెదకాకాని మండలంలోని రెండు, మంగళగిరి మండలంలో ఒక గ్రామాన్ని ఎంపిక చేస్తున్నట్టు తెలిసింది. మొత్తం 14 గ్రామాల్లో రెండో విడత సమీకరణ జరగనుంది.

రాజధాని ప్రాంతానికి నూతన రైల్వే లైను, అంతర్జాతీయ విమానాశ్రయం, అవుటర్ రింగ్ రోడ్డు తదితర అవసరాల కోసం 44 వేల ఎకరాలను తీసుకుంటున్నట్టు అధికారులు చెప్పారు. అయితే ఈ సమీకరణ ఇంకా ఎంత వరకు కొనసాగుతుంది? సమీకరణలో తీసుకున్న భూములకు అభివృద్ధి చేసిన ప్లాట్లు ఎప్పటికి ఇస్తారు? ▶ 2లో

పిడుగుపడి మహిళా పాడిరైతు మృతి

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

పిడుగుపాటుతో మహిళ మృతి చెందిన ఘటన నరసరావుపేట మండలం పాలపాడు పొలాల్లో గురువారం జరిగింది. రొంపిచర్ల మండలం నల్లగార్లపాడుకు చెందిన గట్ల చిన్నమ్మ (55) గేదెలను మేపేందుకు వెళ్లిన సందర్భంలో ఒక్కసారిగా ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం వచ్చి పిడుగు పడడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందారు. విషయం తెలిసిన వెంటనే ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబు ఘటనా స్థలికి చేరుకుని పరిశీలించారు. మృతురాలి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపి, ప్రభుత్వ పరంగా ఆదుకుంటామని చెప్పారు. ఇదిలా ఉండగా పిడుగుపాటుతో యడ్లపాడు మండలంలో బుధవారం ఒక మృత్యువాతపడగా పల్నాడు జిల్లాలో ప్రతి ఏడాది పదుల సంఖ్యలోనే ఈ మరణాలు ఉంటున్నాయి. మూగజీవాలు సైతం పిడుగులు పడి చనిపోతున్నాయి.

ఈదురు గాలుల వల్ల నరసరావుపేట మండలం ఇక్కుర్తి గ్రామంలో వాలిపోయిన వరి పైరు

పంటలను దెబ్బతీస్తున్న వానలు

అల్లూరివారిపాలెంలో ఇంటి ముందు వర్షపు నీరు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

నరసరావుపేట నియోజకవర్గంలో గురువారం ఉరుములు మెరుపులతో కూడిన వర్షం వల్ల... చేతికొచ్చే దశలో ఉన్న రబీ వరిపైరు నేల వాలింది. 40 నిముషాల పాటు ఏకధాటిగా వాన కురవడంతో లోతట్టు ప్రాంతాలోని ఇళ్ల ముందు నీరు నిలిచి ప్రజలు ఇబ్బందులు పడ్డారు. పల్నాడు జిల్లాలో అటవీ విస్తీర్ణం, ఎత్తైన కొండలు, గుట్టలు ఉండడం వల్ల ఆయా ప్రాంతాల్లో సహజంగానే పిడుగులు పడుతుంటాయని, ప్రజలు జాగ్రత్తగా ఉండాలని వాతావరణ నిపుణులు చెబుతున్నారు. వర్షాకాలానికి ముందు అకాల వర్షాల కారణంగా రైతులు ఇబ్బందులు పడుతున్నారు.

ప్రజాశక్తి - కొల్లిపర

మండలంలో మధ్యాహ్నం వేళ ఒక్కసారిగా ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. పలు గ్రామాల్లో అరటి తోటలు ధ్వంసం కాగా, కొన్ని గ్రామాల్లో భారీ చెట్లు నేలకూలాయి.

కొల్లిపర మండలంలో దెబ్బతిన్న అరటి తోట

మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

బదిలీలు, ప్రమోషన్లు పారదర్శకంగా నిర్వహించాలి

యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి-గుంటూరు

రాష్ట్రంలో ఈ నెలలో జరగబోయే ఉపాధ్యాయుల బదిలీలు, ప్రమోషన్‌లలో ఉపాధ్యాయుల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించి పారదర్శకంగా నిర్వహించాలని యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు కోరారు. గురువారం స్థానిక బ్రాడీపేటలోని యుటిఎఫ్ కార్యాలయంలో జరిగిన సంఘం సమావేశంలో వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఉన్నత పాఠశాలలో సమాంతర మీడియంను కొనసాగించాలని, సెక్షన్‌కు ఉపాధ్యాయ, విద్యార్థి నిష్పత్తి 1:45గా చూపాలని అన్నారు. రేషనలైజేషన్‌లో జూనియర్, సీనియర్‌కి ఒకే నిబంధన ఉండేలా చూడాలని, మాన్యూవల్ పద్ధతిలో కౌన్సెలింగ్ జరపాలని కోరారు. ప్రాథమిక పాఠశాల ఏదైనా ఇద్దరు ఎస్‌జిటిలు కచ్చితంగా ఉండేటట్లు ఏర్పాటు చేయాలన్నారు. ప్రభుత్వ విధానాల వల్ల పదేపదే రేషనలైజేషన్‌కు గురవుతున్న ఉపాధ్యాయులకు ఈ బదిలీల్లో తగు న్యాయం చేసే విధంగా పాయింట్స్ కేటాయించాలని కోరారు. మున్సిపల్ ఉన్నత పాఠశాలల్లో అన్ని పోస్టులను అప్‌గ్రేడ్ చేసినందుకు పాఠశాల విద్యాశాఖకు యుటిఎఫ్ రాష్ట్ర సంఘం తరపున అభినందనలు తెలిపారు. యుటిఎఫ్ రాష్ట్ర ప్రచురణల విభాగం చైర్మన్ ఎం.హనుమంతరావు మాట్లాడుతూ వేసవి సెలవులు ముగిసేలోగా ఈ ప్రక్రియ అంతా పూర్తిచేసి జూన్ 12 నుంచి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందేటట్లు చూడాలని ప్రభుత్వాన్ని కోరారు. యుటిఎఫ్ గుంటూరు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు యు.రాజశేఖర్‌రావు, ఎం.కళాధర్ మాట్లాడుతూ గుంటూరు జిల్లాలో సీనియార్టీ లిస్టులన్నీ అప్డేట్‌గా ఉండేటట్లు ▶ 2లో

విజేతలకు బైక్‌ను అందిస్తున్న మంత్రి అనిత

పాడిపరిశ్రమ ద్వారానూ అద్భుతాలు సృష్టించొచ్చు

ఎడ్ల బల ప్రదర్శన పోటీల ముగింపులో మంత్రులు అనిత, రామానాయుడు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి : చేబ్రోలు మండలం వడ్లమూడిలో 8 రోజులుగా జరుగుతున్న ఒంగోలు జాతి ఎడ్ల బల ప్రదర్శన పోటీలు గురువారం రాత్రి ముగిశాయి. ముగింపు సభకు రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత, జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, ప్రభుత్వ సలహాదారు ఎం.ఎ.షరీఫ్, స్థానిక ఎమ్మెల్యే దూళిపాళ్ల నరేంద్ర హాజరయ్యారు. రాజకీయ నాకుడుగానే కాకుండా రైతు బాంధవుడుగా పేరు తెచ్చుకున్న వీరయ్య చౌదరి స్ఫూర్తితో ఈ పోటీలు నిర్వహించడం ముదావాహమని మంత్రులు కొనియాడారు. పాల ఉత్పత్తిదారులకు సంగం డెయిరీ అందించే ప్రోత్సాహకాలను ప్రశంసించారు. మన సంస్కృతి, సంప్రదాయాలను గుర్తు చేసుకునేందుకు ఇలాంటి పోటీలు, ప్రదర్శనలు నిర్వహించాలన్నారు. రైతులకు వ్యవసాయం ద్వారానే కాకుండా పాడి పరిశ్రమ ద్వారా కూడా ఎన్నో అద్భుతాలు సృష్టించవచ్చునని తెలిపారు. ఒంగోలు జాతి ఎద్దులు ఒక బ్రాండ్‌గా వారు అభివర్ణించారు.

సిహెచ్‌ఓలకు వాలంటీర్ల సంఘం మద్దతు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

పెండింగ్ బకాయిలు చెల్లించాలని సిహెచ్‌ఓ 11 రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం దుర్మార్గమని వాలంటీర్ల సంఘం రాష్ట్ర నాయకులు షేక్ హుమాయున్‌బాషా అన్నారు. నరసరావుపేటలోని గాంధీ పార్క్ వద్ద సమ్మె శిబిరాన్ని గురువారం ఆయన సందర్శించి మద్దతుగా మాట్లాడారు. సిహెచ్‌ఓల సమ్మెతో గ్రామీణ పేదలకు వైద్య సేవల్లో అంతరాయం ఏర్పడిందని చెప్పారు. కరోనా కాలంలో ఫ్రంట్‌లైన్ వారియర్స్‌గా వీరు సాహసోపేత సేవలు అందించారని చెప్పారు. వారి కష్టాన్ని ప్రభుత్వం గుర్తించి సమస్యలను పరిష్కరించాలన్నారు. సమ్మెకు గాంధేయవాది ఈదర గోపీచంద్ మద్దతు తెలిపారు.

రానున్న ఐదు రోజులు అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి-పిడుగురాళ్ల

రానున్న ఐదు రోజులపాటు రాష్ట్రవ్యాప్తంగా భారీ నుండి అతి భారీ వర్షాలు పడతాయని ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని పిడుగురాళ్ల మున్సిపల్ కమిషనర్ పర్వతనేని శ్రీధర్ గురువారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఎటువంటి ఇబ్బందులున్నా అందుబాటులోని సచివాలయం కానీ కాల్ సెంటర్ కానీ ఫిర్యాదు చేయాలని సూచించారు. ఈదురు గాలులు, పిడుగులు పడుతున్నప్పుడు చెట్ల కింద ఉండకూడదని, తడిసిన స్తంభాలు ముట్టుకోవద్దని చెప్పారు. వర్షం వల్ల రోడ్లపై చెట్లు విరిగిపడిపోయి ఉంటే కాల్ సెంటర్కు తెలియచేయాలని, మీరు నివసించే పరిసరాలను కూడా పరిశుభ్రంగా ఉంచుకోవాలని దోమలు బెడద రాకుండా చూసుకోవాలని చెప్పారు.

ఖాళీగా ఉన్న 2.38 లక్షల ఉద్యోగాలను భర్తీ చేయాలి

ప్రజాశక్తి- మాచర్ల రూరల్

రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 2.38 లక్షల ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని ఎఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి షేక్ సుభాని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక సిపిఐ కార్యాలయంలో గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. యువతకు ఉద్యోగాలు కల్పించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు హామీని నిలబెట్టుకోవాలన్నారు. నరేంద్ర మోడీ ప్రభుత్వం దాదాపు 12 సంవత్సరాలు పైబడి అధికారంలో ఉన్నా, ప్రతి సంవత్సరం 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తామన్న హామీని నిలబెట్టుకోలేక పోయారన్నారు. మోడీకి మిత్రులైన అంబానీ, అదానీలకు దేశంలోని ప్రభుత్వ ఆస్తులన్నీ కట్టబెడుతున్నారని మండిపడ్డారు. భగత్ సింగ్ నేషనల్ ఎంప్లాయిమెంట్ గ్యారెంటీ యాక్ట్ ఆమలు చేయాలని కోరారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల అవలంబిస్తున్న నిరుద్యోగ యువత వ్యతిరేక విధానాలపైన పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. కార్యక్రమంలో ఎఐవైఎఫ్ నియోజకవర్గ కార్యదర్శి నర్రా రంగస్వామి పాల్గొన్నారు.

ఇండియన్ లాయర్స్ అసోసియేషన్ సత్తెనపల్లి నూతన కమిటీ

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

ఇండియన్ లాయర్స్ అసోసియేషన్ (ఐఎల్ఎ) సత్తెనపల్లి యూనిట్ అధ్యక్ష, కార్యదర్శులుగా న్యాయవాదులు చావ బాబురావు, పాటిబండ్ల రవి నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షులు జి.శాంతకుమార్ గురువారం ప్రకటించారు. న్యాయవాదులు, ప్రజా సమస్యలపై తమ వంతుగా పాటుపడుతూ వాటి పరిష్కారం దిశగా పని చేస్తామని బాబురావు, రవి చెప్పారు. వీరికి పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

చావా బాబురావు, పాటిబండ్ల రవికి అభినందనలు తెలియజేస్తున్న న్యాయవాదులు

రెడ్‌క్రాస్ దినోత్సవాన 30 మంది రక్తదానం

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

ప్రపంచ రెడ్‌క్రాస్ సొసైటీ దినోత్సవం సందర్భంగా గురువారం రక్తదాన శిబిరం నిర్వహించగా 30 మంది రక్తాన్ని దానం చేశారు. తొలుత నిర్వహించిన సమావేశంలో రెడ్‌క్రాస్ సొసైటీ స్థాపన, ప్రపంచంలో ఈ సొసైటీ అందించే సేవలను వక్తలు వివరించారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ మేనేజ్ కమిటీ సభ్యులు పి.సాంబశివరావు, సత్తెనపల్లి గౌరవాధ్యక్షులు రావెల చంద్రశేఖర్, ఉపాధ్యక్షులు దాసరి కోటేశ్వరరావు, కోశాధికారి కావుగంటి రత్తయ్య, కమిటీ సభ్యులు, రెడ్‌క్రాస్ సిబ్బంది పాల్గొన్నారు.

11న ఉచిత మెగా కంటి వైద్యశిబిరం

ప్రజాశక్తి - పెదకూరపాడు

నియోజకవర్గ కేంద్రమైన పెదకూరపాడులో ఆదివారంఉచిత మెగా కంటి వైద్య శిబిరం జరుగుతుందని యూనియన్ బ్యాంక్ విశ్రాంత జనరల్ మేనేజర్ డాక్టర్ కెవిఎల్ రాజు తెలిపారు. మదర్స్ డే సందర్భంగా కొమరాబత్తిన రోజమ్మ (టీచర్), కార్యంశెట్టి జయరావు జ్ఞాపకార్థం ఈ శిబిరాన్ని పెదకాకాని శంకర కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో జిల్లా అంధత్వ నివారణ సంస్థ సౌజన్యంతో స్థానిక ఆర్సీఎం ఎలిమెంటరీ పాఠశాల ప్రాంగణంలో నిర్వహిస్తామన్నారు. ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు శిబిరం జరుగుతుందని, కంటి శుక్లాలు ఉన్న వారిని గుర్తించి వారిని శంకర్ కంటి వైద్యశాల బస్సులో తీసుకువెళ్లి ఉచితంగా కంటి ఆపరేషన్లు చేయిస్తామని చెప్పారు. శిబిరానికి వచ్చేవారు రేషన్ కార్డు, ఆధార్ కార్డు, ఆరోగ్యశ్రీ జిరాక్స్ కాపీలను తీసుకురావా లన్నారు. కంటి ఆపరేషన్ అనంతరం 40 రోజుల తర్వాత ఉచితంగా కంటి అద్దాలు పంపిణీ చేస్తామన్నారు. దీంతో పాటు సాధారణ వ్యాధులు, దంత పరీక్షలకు సంబంధించి పరీక్షలతో పాటు మందులు పంపిణీ చేస్తామన్నారు. శిబిరాలకు వచ్చేవారికి భోజన వసతిని కల్పించినట్లు చెప్పారు. వివరాల కోసం 9900087057, 9490193101 ఫోన్ నంబర్లకు సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ గుడిపూడి రాజు, వ్యాపారవేత్త పావులూరి హరీష్ పాల్గొన్నారు.

వివరాలు చెబుతున్న నిర్వాహకులు

రాజధానిలో నిలిచిన భూ విక్రయాలు

(మొదటి పేజీ తరువాయి)

అనే అంశంపై ఇప్పటి వరకు అధికారికంగా ప్రకటనలు రాలేదు. రాజధాని గ్రామాల్లో 2015లో జరిగిన భూ సమీకరణలో భూములు ఇచ్చిన రైతులకు అభివృద్ధి చేసిన రిటర్నబుల్ ప్లాట్లు ఇవ్వడానికి ఇప్పటికే పదేళ్ల పూర్తయింది? రాబోయే కాలంలో పాలనపరంగా ఏమాత్రం మార్పులు జరిగినా అనేక ఇబ్బందులు వస్తాయని రైతులు భయపడుతున్నారు. ఈ నేపథ్యంలో రాజధాని పరిసర మండలాలతో పాటు పదేళ్ల క్రితమే భూ సమీకరణ జరిగిన గ్రామాల్లో కూడా ప్రస్తుతం భూ లావాదేవీలన్నీ పూర్తిగా మందగించాయి. రాజధానిలో భూ సమీకరణ వల్ల రైతులకు ధరలు పెరిగినా ఇంత వరకు అభివృద్ధి చేసిన ప్లాట్లు అప్పగించకపోవడం కొనుగోలు దారుల్లో పలు సందేహాలు ఏర్పడ్డాయి. దీంతో రాజధాని గ్రామాలకు కొనుగోలుదారులు అలా వచ్చి ఇలా వెళ్లిపోతున్నారు.

2015లో భూ సమీకరణలో తీసుకున్న 34,689 ఎకరాలతో పాటు ప్రభుత్వ భూములు మరో 17 వేల ఎకరాలు కూడా రాజధానికి వినియోగించుకునేందుకు సిఆర్‌డిఎ తన అధీనంలోకి తీసుకుంది. మొత్తంగా 51 వేల ఎకరాలు రాజధానికి సిద్ధం చేయగా ఇంకా 44 వేల ఎకరాలు కూడా సమీకరణకు తీసుకుంటున్నారన్న వార్తలు జిల్లా మొత్తం సామాన్య, మధ్య తరగతి కొనుగోలు దారుల్లో అయోమయాన్ని పెంచింది. ప్రస్తుతం అన్ని ప్రాజెక్టులు,నిర్మాణాలు పూర్తయ్యే వరకు వేచి ఉంటే ఇంత కన్నా మంచి ధరలు వస్తాయని, మరో మూడు ఏళ్లవేచి ఉండక తప్పదని రాజధానిలో సమీకరణలో భూములు ఇచ్చిన రైతులను అమరావతి జెఎసి నాయకులు సర్ది చెబుతున్నారు. వేచి ఉండలేని వారు ప్రస్తుతం ఉన్న ధరలకు అమ్ముకోవచ్చునని, వేచి ఉంటే మంచి ఫలితాలు వస్తాయని భరోసా ఇస్తున్నారు. దీంతో తక్కువ ధరకు అమ్ముకోలేక, తాము ఆశించిన ధరకు కొనే వారు లేక రైతులు అయోమయంలో చిక్కుకున్నారు.

సిఐ స్వర్ణలతే ఎసిబి నకిలీ ఎస్‌పి

అరెస్టు చేసిన పోలీసులు - గతంలో ఆమెపై నోట్ల మార్పిడి కేసు

ప్రజాశక్తి - మధురవాడ (విశాఖపట్నం)

స్థానిక సబ్ రిజిస్ట్రార్ చక్రపాణిని బెదిరించిన నకిలీ ఎసిబి ఇన్‌స్పెక్టర్ సుధాకర్ కేసులో ఆసక్తికర ట్విస్ట్ చోటుచేసుకుంది. సుధాకర్ బాగోతం వెనుక గతంలో ఇలాంటి నేరాలకే పాల్పడి వేటుకు గురైన రిజర్వ్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ స్వర్ణలత ఉందని పోలీసులు గురువారం తేల్చారు. ప్రస్తుతం బాపట్ల ఆర్మ్‌డ్ రిజర్వులో సిఐగా పనిచేస్తున్న ఆమెను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పిఎం.పాలెం సిఐ బాలకృష్ణ వెల్లడించారు.

అసలేంతకీ ఏం జరిగింది ?

సుధాకర్ అనే వ్యక్తి బుధవారం మధురవాడ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లి తాను ఎసిబి సిఐనని రిజిస్ట్రార్‌ను పరిచయం చేసుకున్నాడు. రెండు మూడు రోజుల నుంచి గమనిస్తున్నానని, ఉద్యోగం పేరుతో అవినీతికి పాల్పడుతున్నారని రిజిస్ట్రార్‌ను బెదిరించాడు. ఎటువంటి కేసూ లేకుండా చేసేందుకు డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేసాడు. అనుమానం వచ్చిన సబ్ రిజిస్ట్రార్ 'మీరు ఎసిబి సిఐ అని ఎలా నమ్మాలి' అని ఎదురు ప్రశ్నించాడు. దీంతో ఎసిబి ఎస్‌పిగా చెప్పుకునే ఒక మహిళతో సుధాకర్ ఫోనులో మాట్లాడించాడు. ఆ మహిళ సైతం తాను ఎసిబి ఎస్‌పినని బెదిరించడంతో అనుమానం వచ్చిన సబ్ రిజిస్ట్రార్ చక్రపాణి పిఎం.పాలెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు రంగంలోకి దిగి నకిలీ ఎసిబి అధికారిని అదుపులోకి తీసుకున్నారు. కూపీ లాగితే ఒక్కొక్కటిగా విషయాలు వెలుగుచూశాయి. సుధాకర్ ఫోన్‌లో నకిలీ ఎసిబి ఎస్‌పిగా పరిచయం చేసుకుని రిజిస్ట్రార్ చక్రపాణిని స్వర్ణలత బెదిరించినట్లు ఫోన్ నెంబర్ ఆధారంగా పోలీసులు గుర్తించారు. ఆమెను అరెస్టు చేశారు. గతంలో విశాఖలో రూ.2 వేల నోట్ల మార్పిడి వ్యవహారంలో కొందరిని ఆమె బెదిరించి జైలుకు కూడా వెళ్లారు.

ఇన్‌ఛార్జి ఛైర్మన్‌గా మదార్ సాహెబ్ నేడు ప్రమాణస్వీకారం

ప్రజాశక్తి - మాచర్ల

మున్సిపల్ ఇన్‌ఛార్జి ఛైర్మన్‌గా షేక్‌మదార్ సాహెబ్ శుక్రవారం ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఇప్పటి వరకు ఇన్‌ఛార్జి ఛైర్మన్‌గా వున్న పోలూరి నరసింహారావు సెలవు పెట్టడంతో ఆ బాధ్యతలు షేక్ మదార్ సాహెబ్ స్వీకరించనున్నారు. ప్రమాణస్వీకారం సందర్భంగా శుక్రవారం ఉదయం 9 గంటలకు జెండా చెట్టు వద్ద నుండి బైక్ ర్యాలీ నిర్వహించనున్నట్లు టిడిపి మాచర్ల పట్టణ అధ్యక్షులు కొమెర దుర్గారావు తెలిపారు. కౌన్సిలర్లు, కూటమి పార్టీల శ్రేణులు తరలిరావాలని కోరారు.

బదిలీలు, ప్రమోషన్లు పారదర్శకంగా నిర్వహించాలి

(మొదటి పేజీ తరువాయి)

చూడాలని, పొరపాట్లు ఉంటే తక్షణం సరిచేయాలని, అన్ని ఖాళీలను డిస్‌ప్లే చేసి పారదర్శకంగా బదిలీలు నిర్వహించాలని కోరారు. ఉపాధ్యాయులకు బదిలీలు, ప్రమోషన్లలో ఏమైనా ఇబ్బందులు ఎదురైతే యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో బాధ్యులను సంప్రదించి తగు సహకారం పొందాలని సూచించారు. సమావేశంలో జిల్లా సహాధ్యక్షులు వై.నాగమణి, కార్యదర్శులు సిహెచ్.ఆదినారాయణ, జి.వెంకటేశ్వరరావు, బి.ప్రసాదు, ఎం.కోటిరెడ్డి, కేథార్నాథ్, ప్రేమ్‌కుమార్, చిన్నయ్య, గఫార్, శివరామిరెడ్డి పాల్గొన్నారు.

అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం, నూకలు స్వాధీనం

ప్రజాశక్తి - తెనాలి

అక్రమంగా తరలించేందుకు సిద్ధంగా ఉన్న రేషన్ బియ్యాన్ని పోలీసులు గురువారం స్వాధీనం చేసుకున్నారు. స్థానిక చెంచుపేట ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో రేషన్ బియ్యాన్ని తరలిస్తున్నారని గురువారం డిఎస్పీ బి. జనార్దనరావుకు సమాచారం అందింది. వెంటనే స్పందించిన పోలీసులు అక్కడికి చేరుకుని, 50 బస్తాల్లో రేషన్ బియ్యాన్ని, మరో 15 బస్తాల్లో నూకలను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. సుల్తానాబాద్ కేంద్రంగా రేషన్ దందాకు పాల్పడుతున్న వ్యక్తే మరోసారి అక్రమంగా బియ్యాన్ని తరలిస్తున్నాడని పోలీసుల విచారణలో వెల్లడైంది.

రైలు నుండి జారిపడిన యువకుడు మృతి

ప్రజాశక్తి - తెనాలి

రైల్లో నుండి జారి పడి ప్రయాణికుడు మృతి చెందిన ఘటనపై రైల్వే పోలీసులు కేసు నమోదు చేశారు. వారి కథనం ప్రకారం... పట్టాల వెంబడి మృతదేహం ఉందన్న సమాచారంతో తెనాలి జీఆర్పీ పోలీసులు ఘటనా స్థలాన్ని గురువారం పరిశీలించారు. సుమారు 30 ఏళ్ల వయస్సుడు విజయవాడ-చెన్నై రైలు మార్గంలో కొలకలూరు రైల్వే స్టేషన్ సమీపంలో మృతి చెంది పడి ఉన్నాడు. మృతుడి జేబులో విజయవాడ నుండి తెనాలికి తీసుకున్న టికెట్ ఉంది. మృతదేహాన్ని తెనాలి ప్రభుత్వ వైద్యశాల మార్చురీకి తరలించారు. రైలు నుంచి జారిపడి మృతి చెందినట్లుగా పోలీసులు భావిస్తున్నారు. ఘటనపై కేసు నమోదు చేశారు. మృతుని ఆచూకీ తెలిసినవారుంటే సంప్రదించాలని సూచించారు.

చేతికొచ్చిన మొక్కజొన్న అగ్నికి ఆహుతి

రూ .7 లక్షల పంట నష్టం

ప్రజాశక్తి - దుగ్గిరాల

ఒక్క రైతు అవగాహన లోపం వల్ల అనేకమంది రైతుల చేతి కందిన పంట అగ్నిపాలైనది. మండల కేంద్రం దుగ్గిరాల హౌసింగ్ కాలనీ సమీపంలో గురువారం ఈ సంఘటన చోటు చేసుకున్నది. మొక్కజొన్న దంటు కాల్చటానికి గుర్తుతెలియని రైతు చేనుకు నిప్పు పెట్టగా అదే సమయంలో పెద్ద ఎత్తున గాలి దుమారం చెలరేగి శరవేగంతో చుట్టుపక్కల పొలాలకు మంటలు వ్యాపించాయి. దీనితో చేలలో ఉన్న అనేకమంది పంట అగ్నికు ఆహుతి అయినది. ఈమని గ్రామానికి చెందిన రైతులు కొమ్ము శీను కొమ్ము గోపి, అక్రంశెట్టి మహేష్ బాబుల పంట పూర్తిగా కాలిపోయినది. వల్లూరు నరసింహారావు కు చెందిన రెండు నీళ్ల ఇంజన్లు, తాడి బోయిన నరసింహారావు అనే రైతు పంట కాపాడుకునే ప్రయత్నంలో అగ్ని ప్రమాదానికి లోనయ్యాడు. అతనిని తెనాలి ఆసుపత్రికి తరలించారు. పంట నష్టం దాదాపు 7 లక్షల రూపాయలు వరకు ఉండవచ్చునని అంచనా. సమాచారం తెలుసుకున్న తెలుగుదేశం పార్టీ నాయకులు సంఘటన స్థలానికి చేరుకొని తెనాలి నుండి అగ్నిమాపక శకటన్ని పిలిపించారు. నష్టపోయిన రైతులకు భరోసా ఇస్తూ మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకెళ్లి నష్టపరిహారం అందేటట్లు చూస్తామన్నారు . ఈ కార్యక్రమంలో వ ల్లూరు నరసింహారావు పర్వతనేని హర్ష నక్క చిరంజీవి కే గోపాల్ వినోద్ బి బాలు నవీన్ గౌడ్ బి సుధాకర్ తదితరులున్నారు.

ఆటో డ్రైవరే సూత్ర ధారి...!

కోటేశ్వరరావు హత్య కేసులో పురోగతి - నలుగురు నిందితుల గుర్తింపు

ఘటన జరిగిన గంటన్నర వ్యవధిలోనే కేసును చేధించిన పోలీసులు

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

మంగళగిరి మండల పరిధి పెదవడ్లపూడి, చిలువూరు, గ్రామాల పరిధిలో బుధవారం రాత్రి జరిగిన కోటేశ్వరరావు (47) హత్య కేసులో ఓ ఆటో డ్రైవర్ ప్రధాన సూత్రధారిగా తేలినట్లు చెబుతున్నారు. ఈ కేసులో మొత్తం నలుగురు నిందితులు ఉన్నట్లుగా పోలీసులు నిర్ధారించినట్లుగా తెలుస్తోంది. సదరు నిందితులను తమ అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు సమాచారం. పోలీసులు తెలిపిన కథనం ప్రకారం మంగళగిరి కార్పొరేషన్ పరిధి నవులూరు టిడ్కో గృహ సముదాయంలో నివాసముండే కోటేశ్వరరావుకు భార్య, ఇద్దరు పిల్లలు సంతానం ఉన్నారు. ఈ నేపథ్యంలో కోటేశ్వరరావు యాచనకు అలవాటు పడి హిజ్రా వేషాన్ని ధరించాడు. ఇంట్లో ఉన్న సమయంలో సాధారణంగానే జీవనం సాగిస్తూ ఉంటాడు. రేవేంద్రపాడు వద్ద ఓ గదిలో దుస్తులు మార్చుకొని హిజ్రా అవతారం ఎత్తుతూ ఉంటాడు. హిజ్రా వేషధారణలో ఉన్న కోటేశ్వరరావు మోరంపూడి, చిలువూరు, కొప్పురావూరు గ్రామాలలో యాచిస్తూ, ప్రతి శుక్రవారం తెనాలిలో తన కార్యకలాపాలు కొనసాగిస్తుంటాడు. ప్రతి రోజు సుమారు రూ. 2 వేల వరకు సంపాదిస్తుంటాడు. రఫీ అలియాస్ నర్మదా అనే మహిళతో పరిచయం ఏర్పడింది. ఈ క్రమంలో నర్మద మరో ఆటో డ్రైవర్‌తో వివాహేతర సబంధం కొనసాగిస్తున్న విషయాన్ని సదరు ఆటో డ్రైవర్ భార్యకు కోటేశ్వరరాదవు తెలిపారు. కోటేశ్వరరావు అడ్డు తొలగించుకోవడానికి ఆటోడ్రైవర్ పథకం ప్రకారం బుధవారం రాత్రి కాపు కాసి చిలువూరు వద్ద మరో ముగ్గురితో కలిసి అటుగా

వస్తున్న కోటేశ్వరరావును అడ్డగించి, నరికి హత్య చేశారు. ఆటో డ్రైవర్ సైతం హిజ్రా వేషంలో ఉన్న వ్యక్తిగా గుర్తించామని పోలీసులు తెలిపారు.

గంటన్నరలోనే కేసును చేధించిన పోలీసులు

ఈ కేసులో ప్రాథమికంగా ఆధారాలు ఏవి లభ్యం కానప్పటికీ రూరల్ పోలీసులు గంట న్నర వ్యవధిలోనే కేసును చేధించినట్లుగా తెలుస్తోంది. రూరల్ సీఐ వై శ్రీనివాసరావు నేతృత్వంలో ఎస్సై చిరుమామిళ్ల వెంకట్ దర్యాప్తు చేపట్టి కేసులో పురోగతిని కనబరిచారు. మొత్తం నలుగురు నిందితులను గుర్తించి అది అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు సమాచారం. నిందితులు నలుగురు తెనాలికి చెందిన వారుగా నిర్ధారించారు. ఈనెల 9వ తేదీన మీడియా ముందు నిందితులను ప్రవేశపెట్టనున్నట్లు తెలుస్తోంది.

హత్య కేసులో జీవిత ఖైదు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

సిమెంట్ ఇటుక రాయితో తలపై మోది వ్యక్తిని హతమార్చిన నేరం రుజువుకావడంతో నిందితుడు నరసరావు పేట పట్టణం శివ సంజీవ కాలనీకి చెందిన తన్నీరు అంకమ్మరావు అలియాస్ ముళ్ళ పందికి జీవిత ఖైదు రూ 15 వేల జరిమానా విధిస్తూ స్థానిక 13వ అదనపు జిల్లా సెషన్స్ న్యాయ అధికారి నేతి సత్యశ్రీ గురువారం తీర్పు వెలువరించారు. తెలంగాణ రాష్ట్రం మహబూబ్ నగర్ జిల్లా, కె.సముద్రం మండలం నారాయణపురం గ్రామానికి చెందిన కరివేదుల సంపత్ రెడ్డి 2023 లో నరసరావుపేటకు వచ్చి రైల్వే స్టేషన్ రోడ్ లోని గాంధీ పార్క్ వద్దగల విజయ్ దుర్గ కన్సల్టెన్సీ షాప్ ఎదురు రాత్రి సమయంలో నిద్రించాడు. తెల్లవారేసరికి తలకు తీవ్ర గాయాలతో మృతి చెంది ఉన్నాడు. సమాచారం అందుకున్న మొదటి పట్టణ పోలీసులు మృతుని చొక్కా జేబులో ఉన్న వివరాల సమాచారం అందించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు ఘటనను ప్రతిష్టాత్మకంగా తీసుకొని సాంకేతిక పరిజ్ఞానంతో కేసును చేధించారు. ఘటనా ప్రాంతంలో ఉన్న సిసి పుటేజ్ ఆధారంగా నిందితుడు పాత నేరస్తుడు తన్నీరు అంకమ్మరావుగా నిర్ధారించారు. సిమెంట్ ఇటుకతో ముఖంపై కొట్టి మృతుని జేబులో ఉన్న నగదు తీసుకు వెళ్లినట్లు స్పష్టంగా కనిపించింది. విచారణలో నేరం రుజువు అవడంతో పై విధంగా కోర్టు తీర్పు వెలువడింది.

టైలరింగ్ షాపులో అగ్నిప్రమాదం

రూ.2 లక్షల నష్టమని ప్రాథమిక అంచన

ప్రజాశక్తి -మేడికొండూరు

మండలంలోని పేరేచర్ల జంక్షన్ నుండి, పేరేచర్ల గ్రామంలోనికి వెళ్లే దారిలో ఉన్న, జమీర్ టైలర్ షాపులో గురు వారం అగ్ని ప్రమాదం జరిగింది. షాపు యజమాని షేక్ జమీర్ రోజు మాదిరి గానే గురువారం ఉదయం షాపు తీసి మధ్యాహ్న వరకు బట్టలు కుట్టాడు. అనం తరం మధ్యా హ్నం షాప్ మూసివేసి భోజనానికి ఇంటికి వెళ్ళాడు. భోజనానం తరం తిరిగి షాప్‌కి వచ్చేసరికి షాపులో దట్టమైన మంటలు వ్యాపించాయి. స్థాని కులు ఫైర్ సిబ్బందికి సమాచారం ఇవ్వగా అగ్నిమాపక శాఖ సిబ్బంది వెహికల్ తమ వాహనంతో వచ్చి మంటలను అదుపు చేశారు. టైలర్ షాపులో షార్ట్ సర్క్యూట్ వలన అగ్ని ప్రమాదం సంభవించిందని అగ్నిమాపక శాఖ అధికారులు గుర్తించారు. ఈ అగ్ని ప్రమాదంలో టైలర్ షాపులో నాలుగు అధునాతనమైన ఖరీదైన బట్టలు కుట్టే మిషన్లు, కస్టమర్లవి కొత్తగా ఇచ్చిన బట్టలు, కుట్టి పూర్తయిన తర్వాత డెలివరీ ఇచ్చేందుకు సిద్ధంగా ఉంచిన బట్టలు, మొత్తం రూ.2 లక్షల రూపాయలు నష్టం వాటిల్లినట్లు షాపు యజమాని జమీర్ వాపోయాడు. తన కుటుంబం జీవనోపాధి బతుకుదెరువు టైలరింగ్ వృత్తినే ఆధారపడి జీవిస్తున్నానంటూ బాధితుడు షాపు యజమాని వాపోయాడు. ప్రభుత్వం తనను ఆదుకోవాలని కోరాడు.

కాల్వలో గుర్తుతెలియని మృతదేహం

ప్రజాశక్తి-తెనాలిరూరల్ : కొలకలూరు గ్రామ శివారు కఠెవరం కాల్వలో గుర్తుతెలియని పురుషుని మృతదేహం లభ్యమైనట్లు తెనాలి తాలుకా ఎస్సై ఆనంద్ తెలిపారు. మృతదేహం నీటిపై తేలుతూ, శరీరమంతా కుళ్లిపోయి గుర్తుపట్టడానికి వీలులేకుండా ఉందని తెలిపారు. ఒంటిపై చొక్కా, నడుముకు లుంగి కట్టుకుని ఉన్నట్లు ఆనవాళ్లు తెలిపారు. కొలకలూరు సచివాలయం-2 విఆర్ఓ నాగరాజు ఫిర్యాదు మేరకు ఎఫ్ఐఆర్ నమోదు చేసి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

గుంటూరు నగరపాలక సంస్థ

"ఇ" ప్రొక్యూర్మెంటు టెండరు ప్రకటన

ఇ.టి. నెం 13 /2025-26 **తేది. 07-05-2025**

గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో వివిధ అభివృద్ధి పనులు చేపట్టుటకు గాను "ఇ" ప్రొక్యూర్మెంట్ ప్లాట్‌ఫారం ద్వారా షార్ట్ టెండర్ పద్ధతిన రిజిష్టరు కాంట్రాక్టు దారుల నుండి టెండర్ కోరబడుచున్నవి. ఇతర వివరములకు www.apeprocurement.gov.in (procurement platform) వద్ద చూడవచ్చును.

"ఇ" ప్రొక్యూర్మెంట్ టెండర్స్ 13 /2025-26.

మొత్తం పనుల సంఖ్య	-	02
అంచనాలు మొత్తం	-	19,92,000
పని వివరములు	-	రోడ్లు, కాలువలు మరియు ఇతర పనులు
టెండరు బిడ్లు కనపడు తేది	-	07 -05 -2025 ఉ॥ 10:30 గం॥లకు
టెండరు బిడ్లను వేయుటకు ఆఖరు తేది	-	12-05-2025 సా॥ 3:00 గం॥లకు
టెండరు బిడ్లను తెరచు తేది	-	12-05-2025 సా॥ 3.30 గం॥లకు

సం॥ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్,
నగరపాలక సంస్థ గుంటూరు

ఒరిజినల్ దస్తావేజు పోయినది

పెదకూరపాడు మండల (గ్రామ) కాపురస్తురాలైన పాటిబండ్ల తులసి అనే నాకు మా తాత గారైన (లేటు) గోచిపాత పెద్ద నాగేశ్వరావు వ్రాసి ఇచ్చిన అఫిడవిట్ దస్తావేజు నెంబర్ 11592/2004 ఒరిజినల్ తీసుకొని ముసాపురంలో మా ఇంటి వద్ద నుండి ది 26/04/2025 నా బైకు పై పొన్నెకల్లు మీదుగా వెళుతూ అడ్డరోడ్డు వద్ద అవసరం అయి దస్తావేజు పెట్టిన కవరు కోసం వెతకగా ఒరిజినల్ దస్తావేజు కనిపించలేదు ఎవరికైనా దొరికిన యెడల ఈ క్రింది నంబర్లకు అడ్రస్ కి తెలుపగలరు.

ఇట్లు
పాటిబండ్ల తులసి, పెదకూరపాడు మండలం,
పల్నాడు జిల్లా. ఫోన్: 9908091124

PUBLIC NOTICE

This is to inform the general public that my client, Mr. YETUKURI RAVITEJA, S/o. Srinivasarao, originally residing at D.No: 1-56, Nandigama, Sattenapalli Mandal, Palnadu District, Andhra Pradesh, and presently residing at Plot No: Krishna Residency, Kaviraja Nagar, Sulthanabad, Tenali, Guntur District, Andhra Pradesh, has lost his original Passport bearing No. S6230847, issued on 03-08-2018 and valid until 02-08-2028, issued by the Government of India. The passport was lost while he was traveling from his current residence to Sulthanabad. Despite his sincere efforts, the passport could not be traced. Anyone who finds the above-mentioned original passport is kindly requested to return it to the address mentioned above or contact the undersigned.

M. MANIKYA RAO
Advocate & Notary
Tenali 522201,
Guntur District, Andhra Pradesh

చిలకలూరిపేట పురపాలక సంఘం

Roc.No. 370/Works/2022/E1 **Date :08-05-2025**

E-Procurement Notice

I. 1. Number of Works : 4 2. Estimate Contract Value : Rs. 1673131/-
3. Name of Work :- Supply of Zeep, Manmazdoor and sand bags, JCB, 160 KV transformer for Rapid filling arrangements in Chilakaluripet Municipality
4. Bid Document Download Start Date : 08-05-2025 11.00 AM
5. Bid Document Download End Date : 12-05-2025 4.00 PM
6. Bid Submission Closing Date : 12-05-2025 4.30 PM

I. 1. Number of Works : 7 2. Estimate Contract Value : Rs. 2916940/-
3. Name of Work :- Removal of wet silt at various places and supply of Electrical materials, valves and CID joints for maintenance of street lighting and water supply in Chilakaluripet Municipality.
4. Bid Document Download Start Date : 08-05-2025 11.00 AM
5. Bid Document Download End Date : 14-05-2025 4.00 PM
6. Bid Submission Closing Date : 14-05-2025 4.30 PM

7. Name and address of the office : Sri. P.Srihari Babu, Commissioner
Chilakaluripet Municipality,
Phone : 08647 - 253994, 9849906585
for other detaisl Visit : https://tender.apeprocurement.gov.in

స్వచ్ఛ భారత్ - స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ చిలకలూరిపేట

Sd/- Commissioner,
Chilakaluripet Municipality.

BEFORE THE HONOURABLE DEPUTY REGISTRAR OF CHITS (O/O DISTRICT REGISTRAR) AT GUNTUR, GUNTUR DISTRICT
DISPUTE NO. 80/2024

Between :
M/s Shriram Chits Pvt Ltd. Tenali Branch rep by its Legal Manager / G.P.A Holder .... Disputant
AND
Lingamallu Surya Prakash Rao and others .... Opponents

OP1 : Lingamallu Surya Prakasha Rao, S/o venkata Subba Rao, Hindu, aged 40 years, Business and R/o D.No. 2-36-12/1, Gandhi Nagar, Tenali, Guntur (DT)
OP2 : Lingamallu Naga Raja Kumari, W/o Surya Prakasha Rao, Hindu, aged 35 years, Business and R/o 2-36-12/1, Gandhi Nagar, Tenali, Guntur (Dt.)

Whereas the plaintiff/ disputant has instituted a claim or dispute against you for recovery of an amount of Rs.7,10,524/- you are hereby summoned to appear to this court in person or pleader on the 27-05-2025 at O/o District Registrar, Guntur 10.30 A.M. in the Morning, to answer the claim, and you are directed to produce on that day all the documents upon which you intend to relay in support of your defense.

Take notice that, in default of your appearance on the day before mentioned, the claim will be heard and determined in your absence.

Given under my hand and seal of the Court, this 08th day of April, 2024.

Deputy Registrar of Chits,
Guntur.

మహారాజశ్రీ సివిల్‌జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టు, పిడుగురాళ్ళ
ఇ.పి.నెం. 4/2025 ఇన్ ఓ.యస్.నెం. 117/2020

బిట్వీన్ :
ఆతుకూరి ఉపేంద్ర కుమార్ ...డిహెచ్‌ఆర్/వాది
మరియు
కొనకండ్ల కాశి రామారావు @ మల్లేశ్వరరావు .... జెడిఆర్ / ప్రతివాది

టు :
కొనకండ్ల కాశిరామారావు @ మల్లేశ్వరరావు, తండ్రి వెంకటేశ్వర్లు @ బంగారుకొండ, అడ్రస్ : పిడుగురాళ్ళ టౌన్ & మండలం, పల్నాడుజిల్లా - 522403.

పై నెంబరు ఎగ్జిక్యూటివ్ పిటీషన్‌ను డిహెచ్‌ఆర్ ప్రామిసరీ నోటు డిక్రీ అమలు నిమిత్తం మీపై దాఖలు చేయగా సదరు పిటీషన్‌లో పై కోర్టువారు పలుమార్లు నోటీసులు పంపించిననూ మీరు ఉద్దేశ్య పూర్వకంగా తీసుకొని యుండలేదు. కావున పైన తెలిపిన పిటిషన్ (ఇ.పి.)లో మీకు గల ఆక్షేపణలు తెలుపుకొనుటకు శ్రీ కోర్టువారు ది. 16-5-2025వ తేదీన వాయిదా వేసియున్నారు. సదరు వాయిదారోజు ఉదయం 10-30 గం.లకు మీరు స్వయంగా గానీ, మీ వకీలు ద్వారా గానీ హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకొన గలరు. లేనియెడల సదరు ఇ.పి.ను మీ పరోక్షంగా తీర్మానించబడును.

(శ్రీ కోర్టువారి అనుమతితో)

ఉడతా కోటేశ్వరరావు, అడ్వకేట్,
పిడుగురాళ్ళ, పల్నాడుజిల్లా.

పసుమర్రు రోడ్డులోని అనుమతుల్లోని వెంచరు

అనధికార లే అవుట్‌కు కౌన్సిల్ ఆమోదం!

ప్రజాశక్తి-చిలకలూరిపేట

జీవో 20కు విరుద్ధంగా, సిఎం, మున్సిపల్ మంత్రి ఆదేశాలను పక్కనపెట్టి చిలకలూరిపేట మున్సిపల్ కౌన్సిల్ నిబంధనలు మీరిందనే విమర్శలు వస్తున్నాయి. అనధికార లేఅవుట్లను ఆమోదిస్తూ కౌన్సిల్ తీర్మానం చేయడం ఏమిటనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. గతనెల 30వ తేదీన నిర్వహించిన మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో తొమ్మిదో అంశంగా పసుమర్రు రోడ్డులోని అనధికార లేఅవుట్‌లో ఇళ్ల నిర్మాణానికి ప్లాన్లు మంజూరు చేస్తూ ఏకగ్రీవంగా మోదించారు. అవి అనధికార లే అవుట్లు అని తెలియక కొందరు కొన్నారని సైతం తీర్మానంలో పేర్కొన్నారు. దీనిపై సిఎం చంద్రబాబుతోపాటు తోపాటు మున్సిపల్ శాఖ మంత్రి పి.నారాయణ, కలెక్టర్, ఇతర రాష్ట్రస్థాయి అధికారులకు సైతం తాము ఫిర్యాదు చేశామని కాపు అసోసియేషన్ జాతీయ అధ్యక్షులు మల్లెల శివనాగేశ్వరరావు తెలిపారు. ఈ అనధికారి లే అవుట్‌లో సెంటు రూ.20 లక్షల వరకు ఉందని, వాటిని కొనేవారు సామాన్యులేమీ కాదని పేర్కొన్నారు. దీనిపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని కోరారు.

సమావేశంలో మాట్లాడుతున్న పీడీ ఝాన్సీరాణి

స్వయం సహాయక సంఘాల అవసరం మేరకు రుణాలిచ్చే ప్రణాళిక

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

స్వయం సహాయక సంఘాల సభ్యుల అవసరాలకు అనుగుణంగా, వారి జీవన ప్రమాణాలు పెంపొందించేందుకు సిబ్బంది కృషి చేయాలని డిఆర్‌డిఎ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఝాన్సీరాణి అన్నారు.స్వయం సహాయక సంఘాలకు వార్షిక రుణాలు, వసూళ్ల తదితర అంశాలపై ఎపిఎంలకు, సిసిలకు నరసరావుపేట పట్టణం కోటప్పకొండ రోడ్డులోని జిల్లా కార్యాలయంలో గురువారం శిక్షణిచ్చారు. జిల్లాలో 36500 స్వయం సహాయక సంఘాలు ఉన్నాయని, మండల స్థాయిలో గ్రామ సమాఖ్య అధ్యక్షులకు, గ్రామ సమాఖ్య అసిస్టెంట్‌లకు శిక్షణిచ్చి వారి అవసరాలకు అనుగుణంగా ఈ ఆర్థిక సంవత్సరానికి సంబంధించి జీవనోపాధులు పెంపొందించేందుకు రుణం ఎంత కావాలో క్రెడిట్ ప్లాన్ తయారు చేయాలని చెప్పారు. దీని ఆధారంగా బ్యాంకు లింకేజ్, స్త్రీ నిధి, ఉన్నతి, పొదుపు మంజూరు చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉద్యాన శాఖ అధికారి సిహెచ్ రమణారెడ్డి, డిపిఎంలు, స్త్రీ నిధి ఎజిఎం పాల్గొన్నారు.

వర్షం వల్ల నష్టంపై పరిశీలన

ప్రజాశక్తి - యడ్లపాడు

మండలంలో బుధవారం సాయంత్రం ఈదురు గాలులతో కూడిన వర్షం వల్ల చెట్లు విరిగి ఇళ్లపై పడి ఆస్తి నష్టం జరిగింది. విద్యుత్ స్తంభాలు విరిగిపోయాయి. ఈ నేపథ్యంలో తహశీల్దార్ విజయశ్రీ మండలంలోని సంఘం గోపాలపురంలో గురువారం పరిశీలించారు. నష్టంపై ప్రభుత్వానికి నివేదిస్తామని చెప్పారు. పరిశీలనలో టిడిపి మండల అధ్యక్షులు కె.సాయిబాబు, నాయకులు ఎం.శ్రీనివాస్‌రెడ్డి సర్పంచ్ ఆంజనేయులు పాల్గొన్నారు.

20న సమ్మెలో కార్మికులు, కర్షకులందరూ పాల్గొనాలి

ప్రజాశక్తి-పిడుగురాళ్ల

దేశవ్యాప్తంగా ఈనెల 20న జరిగే సార్వత్రిక సమ్మెలో కార్మికులు, కర్షకులు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరుతూ సిఐటియు, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో స్థానిక కన్నెగంటి హనుమంతు భవనంలో గురువారం సమావేశం సిఐటియు నాయకులు సంపత్ వెంకటకృష్ణ అధ్యక్షతన నిర్వహించారు. పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.ఆంజనేయులు నాయక్ మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి నేతృత్వంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం కార్పొరేటర్ల సేవలో మునిగి తేలుతోందని, వారికి లాభాలు చేకూర్చే విధంగా కార్మికుల శ్రమను దోపిడీ చేసే విధానాలను ఉధృతం చేసిందని అన్నారు. ఇందులో భాగంగా 44 కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్లను తెచ్చిందని, కార్మికులను కట్టు బానిసలుగా మార్చబూను కుందని మండిపడ్డారు. వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్లకు అప్పజెప్పే విధానాలు చేపట్టిందన్నారు. వీటికి వ్యతిరేకంగా గ్రామీణ బంద్, పారిశ్రామిక వాడల్లో సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. అంగన్వాడి, ఆశా, మధ్యాహ్న భోజనం, ఇతర స్కీమ్ వర్కర్లతోపాటు మున్సిపల్, భవన నిర్మాణం, సున్నం తదితర రంగాల్లోని అసంఘటిత కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు. అనంతరం సిఐటియు మండల కార్యదర్శి టి.శ్రీనివాసరావు, ఎఐటియుసి (న్యూ) నాయకులు కొండారెడ్డి చెన్నయ్య, సున్నం బట్టి వాచ్మెన్ యూనియన్ సిటియు నాయకులు ఒర్సు కృష్ణ మాట్లాడారు. డి.శాంతమణి, షేక్ హజ్రా, జయశ్రీ, బి.కొండలు, జి.నాగేశ్వరరావు, ఎ.వెంకటేశ్వర్లు, సుధాకర్, కె.సాగర్‌బాబు పాల్గొన్నారు.

తాము 20వ తేదీన సమ్మెలో పాల్గొంటున్నట్లు పిడుగురాళ్ల ప్రాజెక్టు ఐసిడిఎస్ సూపర్వైజర్ కోటేశ్వరికి అంగన్వాడీలు సిఐటియు ఆధ్వర్యంలో గురువారం సమ్మె నోటీసు అందజేశారు. నాయకులు మాట్లాడుతూ గతంలో 42 రోజులపాటు చేసిన సమ్మె సందర్భంగా గత ప్రభుత్వం

పలుచోట్ల అధికారులకు సమ్మె నోటీసులు

ఇచ్చిన హామీలను ప్రస్తుత ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని, పెండింగ్లో ఉన్న బిల్లులు, జీతాలు ఇవ్వాలని, ఐసిడిఎస్‌కు నిధులు పెంచాలని, సెంటర్ పరిధిలో సమస్యలు పరిష్కరించాలని, గ్రాట్యుటీని అమలు చేయాలని కోరారు. ఈ డిమాండ్ల పరిష్కారం కోసం సమ్మెలో పాల్గొంటున్నట్లు చెప్పారు. సిఐటియు నాయకులు టి.శ్రీనివాసరావు, అంగన్వాడీ ప్రాజెక్టు అధ్యక్ష కార్యదర్శులు షేక్ హజ్రా, డి.శాంతమణి పాల్గొన్నారు.

ప్రజాశక్తి-సత్తెనపల్లి

మున్సిపల్ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని, లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, ఇతర సమస్యలను వెంటనే పరిష్కరించాలని మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) జిల్లా అధ్యక్షులు వి.చంద్రశేఖర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ అంశాలపై ఈనెల 20న జరిగే సమ్మెలో తాము భాగస్వాములం అవుతున్నామని చెప్పారు. ఈ మేరకు మున్సిపల్ కమిషనర్ ఎం.ఆనంద్ కుమార్‌కు నోటీసు అందించారు. మున్సిపల్ కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలన్నారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు జె.రాజ్‌కుమార్, మున్సిపల్ కార్మికులు ఎం.సత్యవతి, దుర్గ పాల్గొన్నారు.

ఆశా వర్కర్లను కార్మికులుగా గుర్తించి కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని సిఐటియు నాయకులు డిమాండ్ చేశారు. ఈనెల 20వ తేదీన సార్వత్రిక సమ్మెలో తాము పాల్గొంటున్నామని తెలియజేస్తూ ఆశా వర్కర్లు బైపాస్ రోడ్‌లోని ప్రైమరీ హెల్త్ సెంటర్‌లోని డాక్టర్‌కు సిఐటియు ఆధ్వర్యంలో నోటీసు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చట్టబద్ధమైన సౌకర్యాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు తమకు అమలు చేయాలని కోరారు. 20 ఏళ్లుగా పేదలకు ఆరోగ్య సేవలు అందిస్తున్నామని, తమను కార్మికుల గుర్తించాలని డిమాండ్ చేశారు.

ఆరేళ్లుగా ఒక్క రూపాయి కూడా పెంచలేదు

11వ రోజుకు కమ్యూనిటీ హెల్త్ సిబ్బంది సమ్మె

నిరసన తెలియజేస్తున్న కమ్యూనిటీ హెల్త్ సిబ్బంది

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

వేతనాల పెంపు, రెండేళ్ల నుండి పెండింగ్‌లో ఉన్న చెల్లింపులు, ఇతర సమస్యల పరిష్కారం కోసం నరసరావుపేట పట్టణం స్టేషన్ రోడ్డులోని గాంధీ పార్క్ వద్ద ధర్నాచౌక్‌లో కమ్యూనిటీ హెల్త్ సిబ్బంది చేపట్టిన నిరవధిక సమ్మె గురువారం 11వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా అధ్యక్షులు అనుపమ కళ్లకు గంతలు కట్టుకుని మాట్లాడారు. ఆరేళ్ల క్రితం తమను విధుల్లోకి తీసుకున్నప్పుడు రూ.25 వేలు వేతనం ఇచ్చారని, అప్పటి నుండి ఒక్క రూపాయి కూడా పెంచలేదని చెప్పారు. ఈ కాలంలో నిత్యావసరాల ధరలు ఎంత పెరిగాయి? ప్రజల జీవన ప్రమాణాల్లో ఏం మార్పులొచ్చాయనే విషయం అధికారులకు, ప్రజా ప్రతినిధులకు తెలియదా అని ప్రశ్నించారు. సంఘం నాయకులతో సిఎం చంద్రబాబు చర్చించి మానవతాదృక్పథంతో కనీసం రూ.5 వేల వేతనం పెంచాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని కోరారు. సిహెచ్‌ఒలను కించపరుస్తూ, కేడర్ల మధ్య చిచ్చుపెట్టే రీతిలో సోషల్ మీడియా వేదికగా నకిలీ ఖాతాలతో పెడుతున్న పోస్టులను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. నకిలీ ఖాతాలపై సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశామని తెలిపారు. ప్రజారోగ్య వ్యవస్థలో పనిచేస్తున్న సిబ్బంది మొత్తం ఒక కుటుంబం మాదిరి కలిసిమెలిసి పని చేస్తూ వ్యవస్థ ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు వినోద్, సాగర్, మస్తాన్, సిహెచ్‌ఒలు పాల్గొన్నారు.

5 వేల మందికి ప్రత్యక్షంగా ఉపాధి

- పరోక్షంగా మరో 3 వేల మందికి
- రాయవరంలో ఇండస్ట్రీయల్ పార్క్‌కు శంకుస్థాపనలోఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి

ప్రజాశక్తి -మాచర్ల

శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి

ఇండస్ట్రీయల్ పార్క్ ఏర్పాటుతో మాచర్ల నియోజకవర్గం అభివృద్ధి సాధిస్తుందని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. మండలంలోని రాయవరం గ్రామ శివారులోని ఏపీ పారిశ్రామిక మౌలిక సదుపాయాల కల్పన కార్పొరేషన్ (ఎపిఐఐసి) భూముల్లో ఎంఎస్ఎంఈల ఏర్పాటుకు ఎమ్మెల్యే గురువారం శంకుస్థాపన చేశారు. దాదాపు రూ.7 కోట్లతో మౌలిక వసతుల పనులకు సంబంధించిన శిలాఫలకాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రాన్ని పారిశ్రామిక హబ్‌గా మార్చేందుకు సిఎం చంద్రబాబు అహర్నిశలు పాటుపడుతున్నారని చెప్పారు. 2018లో నియోజకవర్గంలోని రాయవరం వద్ద 200 ఎకరాలను పరిశ్రమల శాఖకు భూములు కేటాయిస్తే.. వైసిపి ప్రభుత్వ హయాంలో పట్టించుకున్న దాఖలాలు లేవన్నారు. మాచర్లలో అరాచక పాలన రాజ్యమేలడంతో పరిశ్రమల ఏర్పాటుకు పారిశ్రామికవేత్తలు ముందుకు రాలేదని విమర్శించారు.

5 వేల మందికి ప్రత్యక్షంగా ఉపాధి

రాయవరం ఇండస్ట్రీయల్ పార్క్‌లో పరిశ్రమలు నెలకొల్పేందుకు సంబంధించిన అనుమతుల ఆన్‌లైన్ ద్వారా త్వరితగతిన పొందేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ఎమ్మెల్యే చెప్పారు. ఎపిఐఐసి భూముల్లో పరిశ్రమలకు కావాల్సిన మౌలిక వసతుల కోసం ముందస్తుగా రూ.7 కోట్లు, తరువాత మరో రూ.9 కోట్లను ప్రభుత్వం కేటాయించిందని తెలిపారు. రోడ్లు, నీరు, విద్యుత్ వంటి మౌలిక వసతుల కల్పన పనులు శరవేగంగా జరిగేలా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఇప్పటికే ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలను నెలకొల్పేందుకు రిజిస్టర్ అయ్యారని, త్వరలో పరిశ్రమల స్థాపనకు అడుగులు పడనున్నాయని తెలిపారు. పారిశ్రామికవాడలో పెద్ద ఎత్తున పరిశ్రమలను స్థాపించి, ప్రత్యక్షంగా 5 వేల మందికి, పరోక్షంగా మరో 3 వేల మందికి ఉపాధి కల్పనే లక్ష్యంగా ప్రణాళికలు సిద్ధం చేసినట్లు వివరించారు. కార్యక్రమంలో పరిశ్రమల శాఖ జిఎం సుధాకర్, ఎపిఐఐసి జోనల్ మేనేజర్ డాక్టర్ ఎం.ఎల్. నరసింహారావు, డిప్యూటీ మేనేజర్లు మధు, కృష్ణమోహన్, తహశీల్దార్ కిరణ్, మున్సిపల్ కమిషనర్ వేణుబాబు, మున్సిపల్ చైర్మన్ పోలూరి నరసింహారావు, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

నాలుగు లేబర్ కోడ్‌ల రద్దుకోసం 20న సార్వత్రిక సమ్మె

జయప్రదం చేయాలని కార్మిక సంఘాల విస్తృత ప్రచారం

ప్రజాశక్తి- తాడేపల్లి

పోరాడి సాధించుకున్న కార్మిక వర్గ చట్టాలను కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్లను తీసుకువచ్చి నీరు గార్చటానికి ప్రయత్నిస్తుందని అఖిలపక్ష కార్మిక వర్గ చట్టల రక్షణకై మే 20 న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు కోరారు. గురువారం సాయంత్రం తాడేపల్లి పట్టణంలోని ప్రకాష్ నగర్ సిఐటియు కార్యాలయంలో ఏఐటీయూసీ నాయకులు టి వెంకటయ్య, ఏ సి సి సిమెంట్ ఫ్యాక్టరీ యూనియన్ నాయకులు కొరపాటి స్టీవెన్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. సమావేశంలో అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు మాట్లాడుతూ కేంద్రం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను విడనాడాలని డిమాండ్ చేశారు. స్కీం వర్కర్లు, ఆశ వర్కర్లు సమస్యలు పరిష్కరించడంలో మోడీ ప్రభుత్వం నిర్లక్ష్యంగా ఉందని విమర్శించారు. గౌరవ వేతనం పేరుతో ఆశా వర్కర్లను శ్రమదోపిడికి గురవుతున్నారని ఆందోళన వెలిబుచ్చారు. గ్రామ సీమల్లో ప్రజలకు అందుబాటులో ఉంటూ వైద్య సేవలు అందిస్తున్న ఆశ వర్కర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ భద్రత కల్పించడంతోపాటు పర్మినెంట్ చేయాలని, కార్మిక చట్టాలను అమలుపరచాలని కోరారు. మే 20వ తేదీన జరిగే సార్వత్రిక సమ్మెలో ఉద్యోగులు, కార్మికులు, సంఘటిత, అసంఘటిత రంగ కార్మికులు, ప్రభుత్వ రంగ సంస్థల కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో సిఐటియు నాయకులు వేముల దుర్గారావు, బురగ వెంకటేశ్వరరావు, ఏఐటీయూసీ నాయకులు కంచర్ల కాశయ్య, వైయస్సార్ టి యు నాయకులు ఆర్ శ్రీనివాసరాజు, షేక్ బాషా, ఏఐఎఫ్టియూ న్యూ నాయకులు కె. ఆదినారాయణ, ఐ ఎఫ్ టి యు నాయకులు చెన్నయ్య, కార్మికులు కె. బాబు రావు, కే లక్ష్మీ రేణుక, బి సుజాత, తంబి రాణి, లీల,కొండయ్య, వెంగమ్మ, అంకయ్య, నాగేశ్వరరావు, సతీష్, కమల పాల్గొన్నారు.

తాడేపల్లి ప్రకాష్‌నగర్ లో సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

కుంచనపల్లిలో పారిశుద్ధ్య కార్మికులతో మాట్లాడుతున్న పల్లె కృష్ణ

తెనాలిలో హమాలీలతో మాట్లాడుతున్న బాబుప్రసాద్

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్ : కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్ లను రద్దు చేయాలని కోరుతూ మే 20న జరుగు కార్మిక సమ్మెను జయప్రదం చేయాలని, సిఐటియు తాడేపల్లి మండల నాయకులు పల్లె కృష్ణ అన్నారు. గురువారం ఎం.టి.ఎం.సి పరిధిలోని కుంచనపల్లి గ్రామ సచివాలయ పరిధిలోని పారిశుధ్య కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణ మాట్లాడుతూ కార్మికులు పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చిందని విమర్శించారు. కార్మికుల పొట్ట కొట్టి, యాజమాన్యానికి అనుకూలంగా ఉన్న నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, దేశవ్యాప్తంగా సిఐటియు, వివిధ కార్మిక సంఘాల పిలుపునిచ్చాయని అన్నారు. నరేంద్ర మోడీ మూడవసారి అధికారంలోకి వచ్చిన తర్వాత పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు విపరీతంగా పెంచేశారని, నిత్యవసర వస్తువులు ఆకాశాన్ని అంటాయన్నారు. కార్మికులకు వ్యతిరేకంగా కేంద్ర ప్రభుత్వం చట్టాలు చేయడమే కాక, కార్మికులకు రూ.26 వేల కనీస వేతన చట్టాన్ని అమలు చేయడం లేదన్నారు. కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా, నాలుగు లేబర్ కోడ్ లను రద్దు చేయాలని, జరుగు సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ పారిశుధ్య కార్మికులు ఎన్ రాంబాబు, ప్రసాద్, కృష్ణ తులసి, ఇస్సాక్, రవి, తిరపతి రావు, కోటేశ్వరి, ఝాన్సీ పాల్గొన్నారు.

ప్రజాశక్తి-తెనాలిరూరల్

దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని సిఐటియు నాయకులు కొల్లిపర బాబు ప్రసాద్, షేక్ హుస్సేన్ వలి హమాలీలను కోరారు. గురువారం తెనాలి మండలపరిదిలో పినపాడు పౌరసరఫరాల స్టాక్ పాయింట్ గోడౌన్ వద్ద హమాలీలను కలిసి మే 20న నిర్వహించబోయే సార్వత్రిక సమ్మె ప్రాధాన్యతను వివరించి సమ్మె ర్యాలీలో పాల్గొనాలని కోరారు.

పేదల కోసం ఉచిత వైద్యశిబిరాలు

ఎమ్మెల్యే గల్లా మాధవి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

ప్రజలు ఆరోగ్యంగా ఉండాలన్న ఉద్దేశంతో ఉచిత మెగా వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నామనిఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు. గురువారం గుంటూరు 28వ డివిజన్ సీతమ్మ కాలనీలో లలిత సూపర్ స్పెషాలిటీ వారి సౌజన్యంతో ఎమ్మెల్యే గళ్ళా మాధవి మెగా వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో బీపీ, షుగర్ మొదలు కొని థైరాయిడ్, స్త్రీ సంబంధిత సమస్యలకు నిష్ణాతులైన డాక్టర్లతో సేవలు అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ ఈ దైనందిన జీవితంలో పేదలు ఉరుకులు పరుగులు పెడుతూ, తమ ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేస్తున్నారని, ఈ ఆరోగ్య సమస్యలు ఒకే సారి బయటపడిన సమయంలో తీవ్ర మానసిక, శారీరక, ఆర్థిక ఆందోళనకు గురవుతుంటారని, దీనిని ఆదిలోనే గుర్తించి, ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్న లక్ష్యంతో గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో పలు వైద్య సంస్థలతో కలిసి ఉచిత మెగా వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నాను అని ఎమ్మెల్యే గల్లా మాధవి తెలిపారు. ఈ శిబిరంలో డాక్టర్ పి. విజయ, అప్పారావు యాదవ్, కసుకుర్తి హనుమంతురావు, కేశవ,గుంజి శ్రీను, ఆళ్ల హరి, నేపాక పద్మ, డాక్టర్ కల్పన,ములక సత్య వాణి రెడ్డి, రబ్బానీ తదితరులు పాల్గొన్నారు.

పరిహారం చెక్కులు అందచేస్తున్న మేయర్, కమిషనర్

కార్మికుల కుటుంబాలకు అండగా ఉంటాం

ప్రజాశక్తి-గుంటూరు

కార్మిక కుటుంబాలకు గుంటూరు నగరపాలక సంస్థ అండగా ఉంటుందని నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర, కమిషనర్ పులి శ్రీనివాసులు అన్నారు. కార్మికులకు అందాల్సిన పరిహారాలు వెంటనే అందిచడానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్నారు. ఇటీవల మరణించిన ప్రజారోగ్య విభాగ ఔట్సోర్సింగ్ కార్మికురాలు గోర్రుముచ్చు కొండమ్మ కుటుంబ సభ్యులు జి.శ్రీనుకి రూ.5 లక్షల పరిహారం చెక్‌ను, అలాగే కోనా రమాదేవి చనిపోగా వారి కుటుంబ సభ్యులు నూకరాజుకు రూ.2 లక్షల పరిహారం చెక్‌ను గురువారం కౌన్సిల్ సమావేశ మందిరంలో అంది ంచారు. మట్టి ఖర్చుల కింద వారికి రూ.15వేలు ఇప్ప టికే ఇచ్చామన్నారు.కార్మికుల కుటుంబాలకు నగర పాలక సంస్థ నుండి అందాల్సిన పరిహారాలు, పి.ఎఫ్. కూడా త్వరగా అందేలా చర్యలు తీసుకోవాలని సంబందిత విభాగాధిపతులను, సూపరిండెంట్లను ఆదేశించామని తెలిపారు.

5న ఎపిజిఇఎ రాష్ట్ర కౌన్సిల్

ప్రజాశక్తి-గుంటూరు

విజయవాడలో జూన్ 5న జరిగే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం(ఎపిజిఇఎ) రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలను జయప్రదం చేయాలని సంఘం జిల్లా అధ్యక్షులు చాంద్ భాషా పిలుపునిచ్చారు. గురువారం నగరంపాలెంలోని సంఘ కార్యాలంయలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల సమస్యలపై ప్రభుత్వం స్పందించట్లేదన్నారు. రాష్ట్ర కౌన్సిల్ సమావేశానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయు డును ఆహ్వానించి సమస్యలను వివరిస్తామని చెప్పారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలోని ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్లు అందరూ వేలాదిగా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఉద్యోగ సమస్యలే ప్రధాన అజెండాగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం పనిచేస్తుందని చెప్పారు. సమావేశంలో ట్రెజరర్ పోతురాజు, జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి కరీముల్లా షాఖాదరి, కోటా సాహెబ్, జిల్లా సంయుక్త కార్యదర్శి లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న చాంద్‌భాషా

3వ ర్యాకు సాధించిన ఆళ్ల వెంకట సాయి అఖిల్ కు 50 శాతం ఫీజు రాయితీ తో ధ్రువీకరణ పత్రాన్ని అందజేస్తున్న ఇంఛార్జ్ విసి డాక్టర్ కె రాజశేఖరరావు తదితరులు

కెఎల్‌యులో ఇంజినీరింగ్ కౌన్సెలింగ్

తొలిరోజు 540 సీట్లు భర్తీ

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

కె ఎల్ యూనివర్సిటీ విజయవాడ, హైదరాబాద్ క్యాంపస్ లలో ఇంజనీరింగ్ కోర్సులలో ప్రవేశానికై కౌన్సిలింగ్ ప్రక్రియ ప్రారంభమైంది. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి కౌన్సిలింగ్ కు హాజరై వివిధ బ్రాంచీలలో ప్రవేశాలను తీసుకున్నారు. కె ఎల్ యూనివర్సిటీ జాతీయ స్థాయిలో నిర్వహించిన ఇంజనీరింగ్ ప్రవేశ పరీక్షలో 3 వ ర్యాంకు పొందిన ఆళ్ళ వెంకట సాయి అఖిల్ కు, క్రీడల విభాగంలో జీగ్నాష్‌కు సి ఎస్ ఈ విభాగంలో 50 శాతం ఫీజు రాయితీతో యూనివర్సిటీ ప్రొఫెసర్ వైస్ ఛాన్సెలర్ డాక్టర్ కె. రాజశేఖర రావు, కౌన్సిలింగ్ కమిటీ చైర్మన్ డాక్టర్ జగదీష్, కన్వీనర్ డాక్టర్ సుమన్, అడ్మిషన్స్ డైరెక్టర్ డాక్టర్ జె. శ్రీనివాసరావు అధికారికంగా ప్రవేశాలను విద్యార్థులకు అందించారు. ఉదయం నుంచి ప్రారంభమైన కౌన్సిలింగ్ లో ఎస్సీ, ఎస్టీ, ఓ బి సి కోటా కింద విద్యార్థులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. అలాగే మధ్యాహ్నం నుంచి జరిగిన కౌన్సిలింగ్ ప్రక్రియలో ఓపెన్ కేటగిరి కింద మెరిట్ విద్యార్థులు అడ్మిషన్స్ తీసుకున్నారు. ఈ సందర్బంగా అడ్మిషన్స్ డైరెక్టర్ డాక్టర్ జె. శ్రీనివాసరావు మాట్లాడుతూ 11 వ తేదీ ఆదివారం వరకూ కౌన్సిలింగ్ జరుగుతుందని, కె ఎల్ ఇంజనీరింగ్ ప్రవేశ పరీక్షలో ర్యాంకులు పొందిన విద్యార్థులతో పాటు ఓపెన్ కేటగిరి కింద మెరిట్ విద్యార్థులు కౌన్సిలింగ్ కు హాజరు కావచ్చని పేర్కొన్నారు. జె ఈ ఈ లో అత్యుత్తమ పర్సంటైల్ పొందిన విద్యార్థులకు కూడా మెరిట్ స్కాలర్షిప్స్ ద్వారా అడ్మిషన్స్ పొందవచ్చని చెప్పారు.

డాక్టరేట్ పొందిన జాన్‌పాల్‌కు ఘన సత్కారం

ప్రజాశక్తి - తెనాలి

ఇటీవల డాక్టరేట్ పొందిన రాక్ గాస్పల్ చర్చి అధినేత బిషప్ డాక్టర్ పినపాటి జాన్ పాల్ ను పలువురు పట్టణ ప్రముఖులు గురువారం సత్కరించారు. అమెరికాలోని ఇంటర్నేషనల్ అసోసియేషన్ ఫర్ థియొలాజికల్ అక్రిడిటేషన్ సంస్థ గుర్తింపు పొందిన బెంగళూరు న్యూ విజ్డమ్ బైబిల్ కళాశాల నుంచి ఇటీవల ఆయన డాక్టరేట్ పొందిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో స్థానిక మారీసుపేట రాక్ గాస్పెల్ చర్చిలో డాక్టర్ జాన్‌పాల్‌ను మున్సిపల్ వైస్ చైర్మన్ అత్తోట నాగవేణితోపాటు పలువురు సంఘ కాపరులు సత్కరించారు. కార్యక్రమంలో బిషప్ పాముల పరంజ్యోతి, బిషప్ ప్రవర్ధన్ వర్మ, బిషప్ విక్టర్ పాల్, దైవజనులు సువర్ణరాజు, ఎం విజయ్‌కుమార్, జూనియర్ థామస్, విలియంకేరి, రజనీకాంత్, తమనం భూషణం, సంఘ పెద్దలు పి డేవిడ్ రాజు, ఇ శ్రీనివాసరావు, ఆరె దానియేలు, కె భాస్కరరావు, జయరాజు, కె ఏసుదాసు, పి ఫ్రాన్సిస్, ఇ ఏసురత్నం, సంఘస్తులు పాల్గొన్నారు.

డాక్టర్ జాన్ పాల్ ను సత్కరిస్తున్న మున్సిపల్ వైస్ చైర్మన్ తదితరులు

లక్ష్మీ నృశింహ క్షేత్రం దేవస్థానంలో 11న కళ్యాణ మహోత్సవం

ప్రజాశక్తి - గుంటూరు

నల్లపాడు నృసింహపురంలోని స్వయంభూ శ్రీ పుష్పాద్రి లక్ష్మీ నశింహ క్షేత్రం దేవస్థానంలో ఆదివారం నుండి ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు దేవస్థానం అధ్యక్షులు బెండపూడి వెంకట సీతారామ్, కొల్లి తిరుపతిరెడ్డి, ముప్పాళ్ల నరసింహారావు, దుగ్గింపూడి శ్రీనివాసరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం ఐదు గంటలకు నృసింహ జయంతి, రాత్రి 8 గంటలకు శాంతి కళ్యాణ మహోత్సవం, సోమవారం ఉదయం 8 గంటలకు పుష్పయాగం, 11 గంటలకు అన్నప్రసాద వితరణ, సాయంత్రం శ్రీ రాజ్యలక్ష్మీ గోదాదేవి సమేత శ్రీ లక్ష్మీనరసింహస్వామి రథోత్సవం ఉంటాయని తెలిపారు స్వామి వారి కల్యాణం చేయించదలుకున్న వారు దేవస్థానం కార్యదర్శి బెండపూడి లక్ష్మీ నరసింహ ఫోన్ నంబర్ 9849686201కు సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

పవర్‌లిఫ్టింగ్‌లో జ్ఞానదివ్యకు పతకాలు

ప్రజాశక్తి మంగళగిరి

ఉత్తరాఖండ్ డెహ్రాడూన్‌లో జరుగుతున్న ఏషియన్ జూనియర్ క్లాసిక్ ఉమెన్ పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్షిప్‌లో భారతదేశం తరపున పాల్గొన్న నాగం జ్ఞాన దివ్య 84 కేజీ కేటగిరీలో పాల్గొని 2సిల్వర్ మెడల్, 2 బ్రాంజ్ మెడల్స్ సాధించారని గుంటూరు జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షులు కొమ్మాకుల విజయభాస్కర రావు, ప్రధాన కార్యదర్శి షేక్ సందానిలు గురువారం తెలిపారు. నాగం జ్ఞాన దివ్య గుంటూరు జిల్లా తెనాలి వాస్తవ్యురాలు, ఈ విజయం పట్ల పవర్ లిఫ్టర్ నాగం జ్ఞాన దివ్య ని, ఆమె కోచ్ ని గుంటూరు జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ ప్రతినిధులు అభినందించినట్లుగా అభినందించినట్లుగా తెలిపారు.

భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే కన్నా

వడ్డె ఓబన్న విగ్రహ ఏర్పాటుకు భూమి పూజ

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

వడ్డె ఓబన్న పోరాట పటిమ నేటి తరానికి ఆదర్శమని సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. సత్తెనపల్లి తాలూకా సెంటర్లో ప్రముఖ స్వాతంత్ర్య వీరుడు వడ్డే ఓబన్న విగ్రహ ఏర్పాటుకు ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ గురువారం భూమి పూజ చేశారు.. ఈకార్యక్రమంలో మాజీ జడ్పిటిసి బత్తుల వెంకట స్వామి వడ్డేర సంఘ నాయకులు చాలా పిచ్చి మాస్టారు, చల్లాశ్రీనివాసరావు మాజీ సర్పంచి బోలయ్య ఒంటి పులి నాగేశ్వరరావు వేముల శివ మహిళా అధ్యక్షురాలు వేముల శ్రీదేవి వడ్డెర వెల్ఫేర్ బోర్డు మాజీ డైరెక్టర్ కొమెర వీరాంజనేయులు టిడిపి నాయకులు యెలినేడి రామస్వామి ,దరువూరి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. సత్తెనపల్లి మండలం కంకణాలపల్లి గ్రామంలో వీరాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ట మహోత్సవంలో ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో వైద్య శిబిరం

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ప్రపంచ రెడ్ క్రాస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా గురువారం పల్నాడు జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నరసరావుపేటలోని వాగ్దేవి జూనియర్ కళాశాలలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. రెడ్ క్రాస్ చైర్మన్ డాక్టర్ కె.జగన్ మోహన్ రెడ్డి, డాక్టర్ రహంతుల్లా, డాక్టర్ సృజన విద్యార్థులకు, అధ్యాపకులకు సిబ్బందికి చెవి ముక్కు గొంతు, పంటి, కంటి పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో వాగ్దేవి జూనియర్ కాలేజి సెక్రటరి అండ్ కరస్పాడెంట్ రాయల శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ ఓగూరి నాగేశ్వరరావు, డైరెక్టర్స్ కాట్ల రామకోటేశ్వరరావు, కపిలవాయి రాజేంద్ర ప్రసాద్, పాశం కఅష్ణారావు, పి.వి.అచ్యుతరావు, నిర్వాహకులు కూరపాటి గుప్తా, ఆడిటర్ జి.మురళి కృష్ణ, బత్తుల మురళి, వెంకటేశ్వర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

టైలరింగ్‌లో శిక్షణకు ఏర్పాట్లు

ప్రజాశక్తి- పెదకూరపాడు

మహిళలకు టైలరింగ్లో ఉచిత శిక్షణ ఇవ్వడానికి ఏర్పాట్లు చురుకుగా జరుగుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు స్వయం ఉపాధి కల్పించే లక్ష్యంగా శిక్షణ తరగతులు తొంబై రోజులు పాటు నిర్వహించడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఉదయం 9 గంటల నుండి ఒంటిగంట వరకు ఒక బ్యాచ్ 72 మందికి, సాయంత్రం మరో బ్యాచ్ 72 మంది మహిళలకు శిక్షణ ఇస్తారు. 18 సంవత్సరాల నుంచి 50 సంవత్సరాలు వయసులో ఉన్న మహిళలు అర్హతగా నిర్ణయించారు. వీరందరికీ 25 కుట్టు మిషన్ అందుబాటులో ఉంచారు. ప్రస్తుతం ఈ బీసీ, బీసీ మహిళలకు మాత్రమే శిక్షణ ఇస్తారు.

పొలం వివరాలు అందజేయండి

ప్రజాశక్తి-ఈపూరు

అన్నదాత సుఖీభవ పథకానికి సంబంధించి మండలంలో 13 రెవెన్యూ గ్రామాల పరిధిలో 15,135 రైతుల పొలం వివరాలు రైతు సేవా కేంద్రాలలో నమోదయి ఉన్నాయని ఏఓ ఆర్.రామారావు గురువారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రైతు పట్టాదారు పాసుపుస్తకం, ఆధార కార్డు జిరాక్స్ రైతు సేవా కేంద్ర సిబ్బందికి అందజేస్తే వివరాలను నమోదు చేయడం ద్వారా అన్నదాత సుఖీభవ పథకానికి అర్హులవుతారని అప్పుడే రైతుల ఖాతాలో నగదు జమవుతుందన్నారు. రైతులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

సమస్యల పరిష్కారానికి త్వరలో గ్రీవెన్స్ : ఎమ్మెల్యే యరపతినేని

ప్రజాశక్తి - పిడుగురాళ్ల

నియోజకవర్గంలో ఉన్న సమస్యలను పరిష్కరించేందుకు పిడుగురాళ్ల పట్టణంలో త్వరలో గ్రీవెన్స్ నిర్వహించబోతున్నట్లు తెలుగుదేశం పార్టీ కార్యాలయం నుండి గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. గ్రీవెన్స్ నిర్వహించేందుకు గురువారం పట్టణంలోని మన్యం పుల్లారెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆర్ అండ్ బి బంగ్లా మరియు ఎన్టీఆర్ వ్యవసాయ మార్కెట్ యార్డు నందు స్థలాలను గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు పరిశీలించారు. ఈ సందర్భంగా గురజాల నియోజకవర్గం లోని సమస్యలను గ్రీవెన్స్ ద్వారా నేరుగా ప్రజాప్రతినిధులకు ఉన్నత అధికారులకు తెలియజేసి త్వరగా పరిష్కరించుకోవచ్చునని తెలియజేశారు. ప్రభుత్వ వైద్యశాలను సందర్శించిన ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు పట్టణంలోని మార్కెట్ యార్డ్ నందు గల ప్రాథమిక ఆరోగ్య వైద్య కేంద్రాన్ని గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు సందర్శించారు. అందరికీ వైద్య సలహాలు అందించాలని ఇటువంటి లోటుపాట్లు జరగకూడదని వైద్యాధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ మధుబాబు కమిషనర్ పర్వతల శ్రీధర్ మున్సిపల్ చైర్మన్ సుబ్బారావు కూటమి పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే యరపతినేని

నెలాఖరుకల్లా సారారహిత మండలాలుగా ప్రకటించుకోవాలి

ప్రజాశక్తి - మాచర్ల

ఈ నెలాఖరుకల్లా దుర్గి, మాచర్ల, వెల్దుర్తి మండలాలను సారారహిత మండలాలుగా ప్రకటించుకొనేందుకు తగిన చర్యలు తీసుకోవాలని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ గుంటూరు అసిస్టెంట్ కమీషనర్ ఎమ్. రవికుమార్ రెడ్డి ఆదేశించారు. గురువారం ప్రభుత్వము నాటుసారాయి నిర్మూలన కొరకు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నవోదయం కార్యక్రమంలో భాగంగా గుంటూరు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అసిస్టెంట్ కమీషనర్ ఎమ్. రవికుమార్ రెడ్డి, అసిస్టెంట్ సూపరింటెండెంట్ జి.సూర్యనారాయణలు మాచర్ల ప్రొహిబిషన్ ఎక్సైజ్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా ఎడాప్షన్ ఆఫీసర్స్‌తో ఇంట్రాక్ట్ అయ్యారు. రికార్డులు తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఎక్సైజ్ ఇన్స్పెక్టర్లు వెంకట రమణ, సిబ్బంది పాల్గొన్నారు.

గుంటూరు అసిస్టెంట్ కమిషనర్ ఎమ్. రవికుమార్ రెడ్డి

విద్యార్థులకు ఉచిత కంప్యూటర్ శిక్షణ : మెట్టు గోవిందరెడ్డి

ప్రజాశక్తి - మాచర్ల రూరల్

స్థానిక శ్రీ రామక్రిష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత కంప్యూటర్ శిక్షణ తరగతులు గురువారంతో ముగిసినట్లు సేవా సమితి అధ్యక్షులు మెట్టు గోవిందరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గోవిందరెడ్డి మాట్లాడుతూ మానవ సేవయే..మాధవ సేవ అన్న స్వామి వివేకానంద స్ఫూర్తితో తమ సంస్థ ద్వారా ఉచిత కంప్యూటర్ శిక్షణ తరగతులు చేపట్టి 20 మంది విద్యార్థులకు కంప్యూటర్‌పై బేసిక్స్ నేర్పినట్లు తెలిపారు. ప్రతి రోజు ఉదయం 7 గంటల నుండి 8 గంటల వరకు ఉచితంగా యోగ, ప్రాణా యామం, ధ్యానం కార్యక్రమాలను నిర్వహించినట్లు తెలిపారు. సాయంత్రం 6 గంటల నుండి 7.30 వరకు ఉచితంగా స్పోకెన్ ఇంగ్లీషు, నైతిక, ఆధ్యాత్మిక విలువల గురించి క్లాసులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో కంప్యూటర్ టీచర్ గాయత్రి విద్యార్థులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మెట్టు గోవిందరెడ్డి

ఎస్ఐను మర్యాదపూర్వకంగా కలిసిన టిడిపి శ్రేణులు

ప్రజాశక్తి - క్రోసూరు

క్రోసూరు మండల నూతన ఎస్ఐ పి.రవిబాబును గురువారం టిడిపి నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు.ముందుగా శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై రవి మాట్లాడుతూ.. మండలంలో శాంతిభద్రతలపై ప్రత్యేక దఅష్టి పెడతానన్నారు. ట్రాఫిక్ నియంత్రణపై శ్రద్ధ వహిస్తానన్నారు. చట్టాల పరిరక్షణకు స్థానిక నాయకులు సహకరించాలని కోరారు. ఎస్ఐ మాట్లాడుతూ గ్రామాలలో అన్ని రాజకీయ పార్టీ నాయకులు తన సహకరించాలని ఇలాంటి గొడవలు లేకుండా ఉండాలని ఎస్సై కోరారుని తెలిపారు. ఏమన్నా సమస్యలు ఉంటే నేరుగా తనను కలవచ్చని ఎస్ఐ కోరారు ఈ కార్యక్రమంలో మాజీ యార్డ్ చైర్మన్ కాంద్రు కాశయ్య, నలజాల కోటేశ్వరరావు,మన్యం శ్రీనివాసరావు, దుద్దుల యోహాను, షరీఫ్ డాక్టర్ సలీమ్, అనుముల వెంకట్రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఐను అభినందిస్తున్న టిడిపి నాయకులు

యలమందలో మట్టి నమూనాల సేకరణ

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

భూసార పరీక్షలు చేయించడం వల్ల రైతులకు తాము పండిస్తున్న పంటలకు సంబంధించి బహుళ ప్రయోజనాలు చేకూరుతాయని నరసరావుపేట మండల వ్యవసాయ అధికారి వి.నరేంద్రబాబు అన్నారు. నరసరావుపేట మండలంలోని పలు గ్రామాలలో ఇటీవల మండల వ్యవసాయ అధికారి, సిబ్బంది మట్టి నమూనాలు సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నరేంద్ర బాబు మాట్లాడుతూ భూసార పరీక్షలు చేయించుకుని వాటి ఫలితాల ఆధారంగా పంటలు సాగు చేస్తే అధిక దిగుబడి వస్తుందన్నారు. భూసార పరీక్షల ద్వారా వ్యవసాయ క్షేత్రాల్లోని నత్రజని, భాస్వరం, పొటాష్ లభ్యత తెలుసుకోవచ్చని తెలిపారు. తద్వారా తగిన మోతాదులో ఎరువులు, పురుగు మందులు వినియోగించవచ్చని చెప్పారు. ప్రస్తుతం మండలంలో రబీ పంట కోతలు ముగిశాయని వేసవిలో భూములు ఖాళీగా ఉన్నందున భూసార పరీక్షలకు సరైన సమయమన్నారు. ప్రతి మూడేళ్లకు ఒకసారి భూసార పరీక్షలు చేయించుకోవాలని చెప్పారు. మట్టి పరీక్షలు చేయించుకోవాలనుకునే రైతులు రైతు సేవా కేంద్రాలలో సంప్రదించాలన్నారు.

మట్టి నమూనాలను సేకరిస్తున్న సిబ్బంది

వినుకొండలో "నమస్తే" పథకం కింద వేస్ట్ పిక్కర్స్ ప్రొఫైలింగ్..

ప్రజాశక్తి - వినుకొండ

స్థానిక హనుమాన్ నగర్ సచివాలయం నందు భారత ప్రభుత్వ సామాజిక న్యాయ మరియు సాధికారిక మంత్రిత్వ శాఖ మరియు ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వము యొక్క ప్రతిష్టాత్మక పథకం అయిన "నమస్తే" పథకంలో భాగంగా వినుకొండ పురపాలక సంఘ పరిధిలోగల వేస్ట్ పిక్కర్స్ / రాగ్ పిక్కర్స్ యొక్క ప్రొఫైలింగ్ కార్యక్రమం నిర్వహించారు. అసంఘటిత రంగంలో గల చెత్త సేకరించి జీవనోపాధి పొందుతున్న వారి యొక్క సంక్షేమం కొరకు వారి యొక్క వివరాలను "నమస్తే" యాప్ నందు నమోదు కార్యక్రమం చేపట్టినట్లు మున్సిపల్ కమిషనర్ సుభాష్ చంద్రబోస్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నమస్తే ప్రోగ్రామింగ్ కోఆర్డినేటర్ అనిల్ కుమార్, మున్సిపల్ కమిషనర్ ఎం.సుభాష్ చంద్రబోస్, శానిటరీ ఇన్స్పెక్టర్ ఎస్.కె. ఇస్మాయిల్, పల్నాడు జిల్లా దళిత బహుజన రిసోర్స్ పర్సన్ చిన్నప్ప, వాలంటీర్స్, శానిటరీ సెక్రటరీలు, మేస్త్రీలు, మరియు వేస్ట్ పికర్స్ పాల్గొన్నారు.

లండన్ కిడ్స్ ప్రీస్కూల్ ప్రారంభం

ప్రజాశక్తి-సత్తెనపల్లి

సత్తెనపల్లి పట్టణంలో మొట్ట మొదటిగా ఏర్పాటుచేసిన లండన్ కిడ్స్ ప్రీస్కూల్‌ను పట్టణ ప్రముఖులు దరువూరి నాగేశ్వరరావు గురువారం నూతనంగా ప్రారంభించారు. సత్తెనపల్లి పట్టణం రఘురాం నగర్‌లోని యూనిక్ కాన్సెప్ట్ స్కూల్ కు సమీపంలో ఏర్పాటు చేసిన ఈ లండన్ కిడ్స్ ప్రీస్కూల్ యాజమాన్యం, కరస్పాండెంట్ డాక్టర్ వై.గాయత్రి మాట్లాడుతూ యు.కె. కాన్సెప్ట్ కరికులం, సమగ్ర బోధన చేయబడునని ఆమె తెలిపారు. ప్రీస్కూల్ లో ప్లే గ్రూప్,నర్సరీ, ఎల్ కెజీ, యుకెజీ వరకు పిల్లలకు విద్యాబోధన చేయడం జరుగుతుందని ఆమె తెలిపారు. ఈ సదవకాశాన్ని పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాల్సిందిగా ఆమె విజ్ఞప్తి చేశారు.

ఈపూరు వ్యవసాయ మార్కెట్ యార్డు వైస్ చైర్మన్‌గా గోరంట్ల సత్యనారాయణ

ప్రజాశక్తి-ఈపూరు

ఈపూరు వ్యవసాయ మార్కెట్ యార్డ్ చైర్మన్ గా గోరంట్ల సత్యనారాయణ ని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినట్లు మార్కెట్ యార్డు కార్యదర్శి సూరే శ్రీనివాసరావు గురువారం తెలిపారు.వ్యవసాయ మార్కెట్ యార్డు పరిధిలో ఈపూరు, బల్లాపల్లి, శావల్యాపురం మండలాలు ఉండగా శావల్యాపురం మండల కేంద్రానికి చెందిన గోరంట్ల సత్యనారాయణ బిజెపి రాష్ట్ర కౌన్సిల్ మెంబర్, ఉమ్మడి గుంటూరు జిల్లా రైల్వే బోర్డు మెంబర్ గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు.కూటమి ప్రభుత్వం ఏప్రిల్ 4వ తేదీన 15 మంది పాలకవర్గ సభ్యులను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేయగా బల్లాపల్లి మండలం రేమిడిచర్ల చెందిన గిరిజన మహిళ జరపల రాములు బాయి ని చైర్మన్ గా నియమించిన విషయం పాఠకులకు విదితమే.

చలపతిరావు,దావీదు ఆశయాలు కొనసాగించాలి

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

పేదలు ఎదుర్కొంటున్న అనేక సమస్యల పైన పనిచేసిన పేదల పక్షపాతులు చలపతిరావు, దావీదులు అని సిపిఎం తాడేపల్లి మండల కార్యదర్శి పల్లె కృష్ణ అన్నారు. యం టియంసి పరిధిలోని ప్రాతూరు గ్రామంలో గురువారం రాత్రి అమర జీవులు డోకిపర్తి చలపతిరావు, చౌక్కా దావీదుల 28వ వర్ధంతి సభ సిపిఎం గ్రామ కార్యదర్శి డోకిపర్తి రాజేంద్ర బాబు అధ్యక్షతన జరిగింది. ముందుగా చలపతిరావు చిత్రపటానికి సిపిఎం సీనియర్ నాయకులు జొన్న శివశంకరరావు, చౌక్కా దావీదు చిత్రపటానికి సిపిఎం తాడేపల్లి మండల కార్యదర్శి పల్లె కృష్ణ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కృష్ణ మాట్లాడుతూ అమర జీవులైన చలపతిరావు, దావీదుల మరణం ప్రాతూరు గ్రామానికే కాక, గుండి మెడ, మెల్లంపూడి గ్రామాల పార్టీ అభివృద్ధికి తీరనిలోటన్నారు. అమర జీవుల స్ఫూర్తితో ప్రతి కార్యకర్త పనిచేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. సిపిఎం సీనియర్ నాయకులు జొన్న శివశంకరరావు మాట్లాడుతూ చలపతిరావు గ్రామ సర్పంచ్ గా , సిపిఎం నాయకుడిగా ఈ ప్రాంత పేదల హృదయాలలో చెరగని ముద్ర వేశారని అన్నారు. గ్రామంలో అనేక అభివృద్ధి పనులను చేపట్టి, మైనార్టీ వర్గాలుగా ఉన్న పేదలకు, ఇసుక క్వారీ కార్మికులకు అండగా ఉన్నారని అన్నారు. గ్రామ అభివఅద్ధిలో అమర జీవులు చేసిన త్యాగం మరువలేనిదని, పార్టీ అభివృద్ధికి విశేషంగా కృషి చేసిన చలపతిరావు ధన్యజీవి అన్నారు. సిపిఎం సీనియర్ నాయకులు దొంతిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు కంచర్ల జేమ్స్, బత్తుల సంసోను, దాసరి సురేష్, బుర్రా రాజు, మిరియాల కోటేశ్వరరావు (ఏఈ), చౌక్కా మరియదాసు, గుడిసె శేఖర్, గుడిసె రవి పాల్గొన్నారు.



వర్ధంతి సభలో మాట్లాడుతున్న సిపిఎం తాడేపల్లి మండల కార్యదర్శి పల్లె కృష్ణ, అమర జీవులు డోకిపర్తి చలపతిరావు, చౌక్కా దావీదులు

గుంటూరు తూర్పులో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి- గుంటూరు

గుంటూరు నగరం రాజధానిలో భాగంగా ఉన్నందున అందుకు తగ్గట్టుగా అభివఅద్ధి పనులు నిర్వహిస్తున్నామని నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర అన్నారు. గురువారం తూర్పు నియోజకవర్గంలో రూ.91లక్షలతో వివిధ అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే నసీర్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. 57వ డివిజన్ బసవతారక రామనగర్‌లో రూ.39.80 లక్షలతో, 54వ డివిజన్ రాజేశ్వరరావు కాలనీలో రూ.31.70 లక్షలతో, 50వ డివిజన్లోని మల్లిఖార్జునపేట 2వ లైన్‌లో రూ.19.50 లక్షలతో సిసి రోడ్లు, డ్రైన్లు నిర్మించటానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నగరంలో అభివృద్ధి పనులు వేగవంతంగా నిర్వహిస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో డిప్యూటి మేయర్ షేక్.సజీల, కార్పొరేటర్లు పఠాన్ నూర్జహాన్, మల్లవరపు రమ్య, ఈరంటి వరప్రసాద్, జిఎంసి అధికారులు పాల్గొన్నారు.

పదో తరగతి విద్యార్థులకు అభినందనలు

ప్రజాశక్తి- తాడేపల్లి

గురువారం తాడేపల్లి బైపాస్ రోడ్ లోని మాదిగ కార్పొరేషన్ కార్యాలయంలో ఇటీవల ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి పరీక్ష ఫలితాల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థినీ విద్యార్థులను కార్పొరేషన్ చైర్మన్ ఉండవల్లి శ్రీదేవి చాలువలతో అభినందించారు. జ్ఞాపికలు కూడా అందజేశారు. ఈ సందర్భంగా ఉండవల్లి శ్రీదేవి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదివి విద్యార్థులు దూర దృష్టి, నిబద్ధత తనను ఆకర్షించేయని చెప్పారు.

ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులు పంపిణీ

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి పట్టణం, మంగళగిరి రూరల్ మండలాలకు మంజూరైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను స్థానిక టీడీపీ నాయకులు గురువారం పంపిణీ చేశారు. మంగళగిరి పట్టణంలోని 22వ వార్డుకు చెందిన గోలి అరుణకు రూ. 2,54,441, సూర్యనారాయణ నగర్‌కు చెందిన ఆదిమల్ల చిట్టెమ్మకు రూ. 81,000, మంగళగిరి మండలం నవులూరు గ్రామానికి చెందిన చదలవాడ లక్ష్మీ సుధాకు రూ. 1.50,000, క్రాపా కోటేశ్వరావుకు రూ. 1,30,000 విలువైన చెక్కులు అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సివిల్ సప్లై కార్పొరేషన్ డైరెక్టర్ తోటా పార్థసారథి, పట్టణ ఉపాధ్యక్షులు గోవాడ దుర్గారావు, పట్టణ ప్రధాన కార్యదర్శి షేక్ రియాజ్, మండల ప్రధాన కార్యదర్శి మల్లవరపు వెంకట్, రాష్ట్ర బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి గుత్తికొండ ధనుంజయరావు, నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షులు కారంపూడి అంకమ్మ రావు, నియోజకవర్గ తెలుగుయువత అధ్యక్షులు పడవల మహేష్, 22వ వార్డు అధ్యక్షులు కాసిన కొండలరావు, గ్రామ పార్టీ అధ్యక్షులు రుద్ర కోటేశ్వరావు వడిశా నరేష్, ఆకురాతి నాగేంద్రం, జూట్రు ఏడుకొండలు, కొల్లి వెంకటరావు, కాసులు వేణు, ఇమ్మంది చిన్న కఅష్ణ, కొత్త శ్రీనివాసరావు, కొల్లి వెంకటరావు, తోట శీనుబాబు, తెల్లమేకల నాగేశ్వరావు, పైలా రవి, మరీ ఏసుబాబు, దైదా యాకోబ్, బోడిపోగు ఆబేలు, దర్శనం సాంబశివరావు, షేక్ మస్తాన్ వలి, బోదాటి శ్రీనివాసరావు, కొల్లి శ్రీనివాసరావు, గుంటి ప్రతాపు, కుక్కమళ్ల ఈశ్వర్, కాకాని వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

తప్పుడు ధ్రువపత్రాలతో భూమిని ఆక్రమించారు

ప్రజాశక్తి - మంగళగిరి

తమ పేరుపై ఉన్న పొలాన్ని కొందరు వ్యక్తులు ఆక్రమించడమే కాకుండా అదేమని అడిగితే దాడులకు దిగుతున్నారని నందిగామ నియోజకవర్గం చందర్లపాడు మండలం ఏటూరు గ్రామానికి చెందిన పలువురు వాపోయారు. గురువారం మంగళగిరిలోని ప్రెస్ క్లబ్‌లో విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కరణం శ్రీనివాస్ అనే వ్యక్తి మాట్లాడుతూ తన తండ్రి చిన్నయ్యకు 231 సర్వే నంబర్ నందు సుమారు ఎకరం ఎనభైన్నర సెంట్లు, సర్వేనెంబర్ 230/2లో ఎకరం 40 సెంట్లు పొలం ఉందని అన్నారు. సదరు ఆస్తి తన తండ్రి మరణానంతరం తనకు సంక్రమించిందని తెలిపారు. సదరు పొలాన్ని అదే ప్రాంతానికి చెందిన పలువురు నకిలీ పత్రాలు సఅష్టించి ఆక్రమించారని ఆరోపించారు.. తమ పొలాన్ని ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఇప్పటికే అధికారులకు ఫిర్యాదు చేశామని అయినా పట్టించుకోవడం లేదని తమకు న్యాయం చేయాలని కోరారు. కొప్పురావూరు సూర్యలక్ష్మి అనే మహిళ మాట్లాడుతూ, తన పేరుపై ఏటూరు గ్రామంలో ఎకరం 2 సెంట్లు భూమి ఉందని తెలిపారు. ఈ భూమిని కొందరు ఆక్రమించడమే కాకుండా తన పొలంలోకి వచ్చి తనపై దాడికి దిగారని వాపోయారు. సమావేశంలో కరణం భారతి, నవనీతం ఉదయలక్ష్మి, కృష్ణవంశీ, లక్ష్మి, తదితరులు పాల్గొనగా, వారి వెంట జనసేన పార్టీ నాయకులు వరి మహేష్ ఉన్నారు.

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బాధితులు

12న మంగళగిరిలో బుద్ధ పూర్ణిమ వేడుకలు..

ప్రజాశక్తి - మంగళగిరి

బుద్ధ జయంతిని పురస్కరించుకొని రాయల్ బంకెట్స్ లో గురువారం ఈనెల 12వ తేదీన జరిగే బుద్ధ పూర్ణిమ వేడుకలకు సంబంధించిన బ్రోచర్న ఆవిష్కరించారు. వేడుకలు మంగళగిరి పట్టణంలోని రాయల్ కన్వెన్స్‌లో జరుగుతున్నాయని మానవతా వేదిక కన్వీనర్ గోలి మధు తెలిపారు. ఈ సందర్భంగా ఆహ్వానం కమిటీ అధ్యక్షులు జి.ధనుంజయరావు మాట్లాడుతూ మంగళగిరి బుద్ధ విహార మానస పుత్రిక ఈ మానవతా వేదిక అని, గత 23 ఏళ్లుగా మంగళగిరి బుద్ధ విహార నిర్వహించిన ముద్ద పూర్ణిమ వేడుకలను బౌద్ధ వ్యాప్తిని పూర్తిగా తీసుకుని మానవతా వేదిక మీద ఈ సంవత్సరం 25వ బుద్ధ పూర్ణిమ వేడుకలను నిర్వహిస్తున్నట్లుగా తెలిపారు. కార్యక్రమంలో రేఖాకృష్ణార్జునరావు, విశ్వశాంతి కళా పరిషత్ కన్వీనర్ పొట్లాబత్తుని లక్ష్మణరావు, పిరమిడ్ సీనియర్ మాస్టర్, ఆకురాతి శంకర్రావు, ప్రజానాట్యమండలి కళాకారులు గాయకులు కంచర్ల కాశయ్య, సందుపట్ల భూపతి, అలక తాతారావు తదితరులు పాల్గొన్నారు.

బ్రోచర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

మాట్లాడుతున్న సహాయ సంచాలకులు సువర్ణ, శిబిరానికి హాజరైన వికలాంగులు వయోవృద్ధులు

వయోవృద్ధుల సంక్షేమానికి కృషిచేస్తున్న ప్రభుత్వం

ప్రజాశక్తి - తెనాలి

దారిద్ర్య రేఖకు దిగువనున్న వికలాంగులు, వయోవృద్ధుల సంక్షేమం కోసం ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తుందని వయోవృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు సిహెచ్ సువర్ణ అన్నారు. తెనాలి పురపాలక సంఘం ఆధ్వర్యంలో ఉపకరణాలకు అర్హులైన లబ్ధిదారులను గుర్తించేందుకు స్థానిక రామకఅష్ణ కవి కళాక్షేత్రంలో గురువారం శిబిరాన్ని నిర్వహించారు. హైదరాబాదుకు చెందిన ప్రముఖ ఆర్టిఫిషియల్ మ్యానుఫ్యాక్చరింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (అలింకో), గుంటూరు జిల్లా విభిన్న ప్రతిభావంతులు, టిజి, వయోవఅద్ధుల సంక్షేమ శాఖ సహకారంతో ఏర్పాటుచేసిన ఎంపిక శిబిరంలో తెనాలి, కొల్లిపర మండలాల నుంచి పెద్ద సంఖ్యలో దివ్యాంగులు, వయోవృద్ధులు పాల్గొన్నారు. సదరం వైద్య ధ్రువీకరణ పత్రంతో పాటు, రేషన్ కార్డు, ఆధార్ కార్డు, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు సేకరించారు. మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వయోవృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు సిహెచ్ సువర్ణ, తహశీల్దార్ కెవి గోపాలకృష్ణ, తెనాలి కొల్లిపర ఎంపీడీవోలు అత్తోట దీప్తి, కె విజయలక్ష్మి మాట్లాడారు. కార్యక్రమంలో రాష్ట్ర పౌరసరఫరాల శాఖామంత్రి మంత్రి మనోహర్ ఒఎస్డి ఏసురత్నం, అలింకో సంస్థ డాక్టర్లు విక్రమ్ మహారాణా, ప్రియ వర్మ, మున్సిపల్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రాంప్రసాద్, వార్డ్ సచివాలయ కార్యదర్శులు, మునిసిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

దీక్షల్లో పాల్గొన్న కార్మికులు

156వ రోజుకు చేరిన దీక్షలు

ప్రజాశక్తి - తాడేపల్లి

ఏసిసి సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు తమకు న్యాయంగా రావలసిన బకాయిల కోసం చేస్తున్న రిలే దీక్షలు గురువారం నాటికి 156వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో కె.అగ్గయ్య, డి,రమణ, వి.లక్ష్మి, దేవరాజు, డి.నాగేశ్వరరావు కూర్చున్నారు. దీక్షలను సిఐటియు తాడేపల్లి పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు, యూనియన్ నాయకులు కూరపాటి స్టీవెన్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బి.అంకయ్య, సాంబయ్య, కె. విజయ, ఎం.గురవయ్య, టి.నాగేశ్వరరావు, సిహెచ్. చిన్న పున్నారావు, వి.గంగాధర్, ఈ.శారమ్మ, టి.దుర్గ భవాని, ఎ. విజయశ్రీ తదితరులు పాల్గొన్నారు.

టిఫిన్, తోపుడు బండ్లు పంపిణీ

ప్రజాశక్తి - మంగళగిరి

ఐటీ, విద్య శాఖల మంత్రి నారా లోకేష్ మంగళగిరి పట్టణ చిరువ్యాపారులకు చేయూత నందించారు. మంగళగిరి పట్టణానికి చెందిన చాగల అక్కమ్మకు తోపుడు బండి, కోలా నాగేశ్వరరావుకు టిఫిన్ బండిని మంత్రి నారా లోకేష్ ఆర్థిక సహకారంతో గురువారం అందజేశారు. అద్దె బండ్లు తీసుకుని వ్యాపారం చేసుకుంటున్నామని, తమకు బళ్లు అందజేయాలని మంత్రి నారా లోకేష్ ని కోరగా వెంటనే స్పందించిన ఆయన స్థానిక నాయకుల చేతుల మీదుగా బళ్లను అందజేయించారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ ప్రధాన కార్యదర్శి షేక్ రియాజ్, ఉపాధ్యక్షులు గోవాడ దుర్గారావు, రాష్ట్ర కృష్ణ బలిజి సాధికార సమితి సభ్యులు అన్నం నాగబాబు, జొన్నాదుల రామాంజనేయులు, నల్లగొర్ల శివరామకృష్ణ, పిప్పళ్ళ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న సబ్ కలెక్టర్ సంజనా సింహ

ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సేవలు మరింత విస్తృతం కావాలి

ప్రజాశక్తి - తెనాలి

ప్రకఅతి వైపరీత్యాలు సంభవించినప్పుడు రెడ్ క్రాస్ సంస్థ చేపట్టే సహాయక కార్యక్రమాలు అభినందనీయమని, అవి మరింత విస్తృతం కావాలని సబ్ కలెక్టర్ సంజన సింహ అన్నారు. అంతర్జాతీయ రెడ్ క్రాస్ దినోత్సవం, తల సేమియా దినోత్సవాన్ని పురస్కరించుకొని రెడ్ క్రాస్ సొసైటీ తెనాలి శాఖ ఆధ్వర్యంలో స్థానిక పాత ప్రభుత్వ వైద్యశాలలో ఏర్పాటుచేసిన రక్తదాన శిబిరాన్ని సబ్ కలెక్టర్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సామాజిక దృక్పథంతో పనిచేస్తున్న రెడ్ క్రాస్ సంస్థలో ప్రతి ఒక్కరు సభ్యులుగా చేరాలన్నారు. "సర్ జీన్ హెన్రీ డ్యూనంట్ " జన్మదినోత్సవం సందర్భంగా ప్రపంచవ్యాప్తంగా రెడ్ క్రాస్ వేడుకలు నిర్వహిస్తారని ఆమె తెలిపారు. రెడ్ క్రాస్ సేవలను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో రెడ్ క్రాస్ తెనాలి శాఖ చైర్మన్ ముమ్మనేని భానుమతి, కోశాధికారి నాలం శ్రీమన్నారాయణ, రెడ్ క్రాస్ కార్యనిర్వాహక సభ్యులు కుర్ర శ్రీనివాస్, కొత్త కృష్ణ కుమార్, కొంజేటి మురళి, డాక్టర్ పావని ప్రియాంక, రెడ్ క్రాస్ జిల్లా కోఆర్డినేటర్ ఎస్.కె. జానీ రసూల్ పాల్గొన్నారు.

విభిన్న ప్రతిభావంతులకు డిఎస్‌సి క్రాష్ కోర్సు

ప్రజాశక్తి-గుంటూరు

జిల్లాలోని విభిన్న ప్రతిభావంతులైన అభ్యర్థుల కోసం ఉచిత మెగా డిఎస్సీ క్రాష్ కోర్స్ శిక్షణను విజయవాడలో నిర్వహించనున్నట్లు విభిన్న ప్రతిభావంతులు శాఖ సహాయ సంచాలకులు ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్యముగా దృష్టిలోపం, వినికిడిలోపం, ఆర్థోపెడిక్ మొదలగు విభిన్న ప్రతిభావంతులైన, ఎస్.జి.టి టీచర్ పోస్టులకు అర్హత గల అభ్యర్థుల కోసం ఈశిక్షణ ఏర్పాటు చేయటం జరిగిందన్నారు. ఈనెల 11వ తేదీ వరకు ఈ కోర్సుకు ధరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. అభ్యర్థులు ఆన్లైన్ ద్వారా mpfc.apcfss.in వెబ్‌సైట్‌ను సందర్శించి దరఖాస్తు చేసుకోవచ్చని, కనీసం 40శాతం వికలాంగత్వం ఉన్నవారు మాత్రమే అర్హులన్నారు. శిక్షణ కోసం ఎంపిక టెట్ స్కోర్ ఆధారంగా జరుగుతుందన్నారు. ఎంపికైన అభ్యర్థులకు ప్రత్యేక భోదనా పద్దతుల్లో శిక్షణ, స్టడీ మెటీరియల్, ఉచిత భోజనం, వసతి సౌకర్యాలు కల్పించబడతాయని తెలిపారు. ఈ అవకాశాన్ని జిల్లాలోని విభిన్న ప్రతిభావంతులైన మెగా డి.ఎస్.సి అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వెబ్‌సైట్‌ను ఆవిష్కరిస్తున్న మేయర్ కోవెలమూడి రవీంద్ర, కమిషనర్

జిఎంసి వెబ్‌సైట్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు నగరపాలక సంస్థకు సంబంధించి ప్రజలకు అందించే సేవలను విస్తృతంగా, వేగంగా అందుబాటులో ఉంచేలా అధికారిక వెబ్‌సైట్, మొబైల్ అప్లికేషన్స్‌ను రూపొందించామని నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర అన్నారు. గురువారం జిఎంసి ప్రధాన కార్యాలయంలో నగర కమిషనర్ పులి శ్రీనివాసులుతో కలిసి జిఎంసి వెబ్‌సైట్, మొబైల్ అప్లికేషన్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ప్రజలు అందరూ వెబ్‌సైట్‌ను, మొబైల్ అప్లికేషన్‌ను వినియోగించుకొని సేవలు పొందేలా రూపొందించటం జరిగిందన్నారు. ఎప్పటికప్పుడు ప్రభుత్వ ఆదేశాలు, లక్ష్యాలను ప్రజలకు తెలిసేలా వెబ్‌సైట్ లో పొందుపరచాలని సూచించారు.కమిషనర్ మాట్లాడుతూ సుదీర్ఘకాలంగా వినియోగంలో లేని జిఎంసి వెబ్‌సైట్‌ను ఆధునిక ఫీచర్లతో రూపొందించామన్నారు. అలాగే ప్రజలు అన్ని రకాల ఫిర్యాదులు, సేవలను పొందేందుకు సమగ్రంగా అందుబాటులోకి తెచ్చామన్నారు. ప్రజలు ప్లేస్టోర్ నుండి ఆయా మొబైల్ అప్లికేషన్స్ ను డౌన్‌లోడ్ చేసుకొని జిఎంసి సేవలను వేగంగా అందుకోవాలని కోరారు. సమావేశంలో అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, విభాగాధిపతులు, డిప్యూటీ కమిషనర్లు, వివిధ డివిజన్ల కార్పొరేటర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

పట్టాభి సీతారామయ్య విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న జవహర్

నిత్య చైతన్య స్ఫూర్తి భోగరాజు పట్టాభి సీతారామయ్య

విగ్రహావిష్కరణలో యూనియన్ బ్యాంక్ రీజియన్ హెడ్ జవహర్

ప్రజాశక్తి-గుంటూరు

ఆంధ్రాబ్యాంక్‌తో పాటు అనేక ఆర్థిక, బీమా సంస్థలను స్థాపించి తెలుగువారి కీర్తిని దశదిశలా చాటిన డాక్టర్ భోగరాజు పట్టాభి సీతారామయ్య బ్యాంకు ఉద్యోగులతోపాటు తెలుగు వారందరికీ చిరస్మరణీయులని యూనియన్ బ్యాంక్ రీజియన్ హెడ్ సయ్యద్ జవహర్ అన్నారు. ఆంధ్రాబ్యాంక్ రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ గుంటూరు, నరసరావుపేట రీజియన్స్ ఆధ్వర్యంలో స్థానిక హిందూ కాలేజీ యూనియన్ బ్యాంక్ వద్ద డాక్టర్ భోగరాజు పట్టాభి సీతారామయ్య కాంస్య విగ్రహాన్ని రీజియన్ హెడ్ జవహర్‌తోపాటు ఆంధ్రా, యూనియన్ బ్యాంక్ విశ్రాంత అధికారులు, యూనియన్ నాయకులు, ఉద్యోగులు పెద్ద ఎత్తున పాల్గొని పూలమాలు వేసి ఆవిష్కరించారు. అనంతరం స్థానిక రెవెన్యూ కల్యాణ మండపంలో జరిగిన సభలో జవహర్ మాట్లాడుతూ డాక్టర్ భోగరాజు స్ఫూర్తితో రిటైర్డ్ ఉద్యోగులు, మహిళలు, విద్యార్థుల కోసం కొత్త పథకాకాలు ప్రవేశపెట్టి అమలు చేస్తున్నామన్నారు.ఆంధ్రప్రదేశ్ రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ చైర్మన్ ఎ.రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ సీతారామయ్య స్థాపించిన ఆంధ్రాబ్యాంక్ మిగతా జాతీయ బ్యాంకుల యాజమాన్యం ఖాతాదారులు ఉద్యోగుల సంబందాల పట్ల ఒక రోల్ మోడల్ గా నిలిచిందన్నారు. కార్యక్రమంలో ప్రోగ్రాం కమిటీ చైర్మన్ కె.హరిబాబు, ఆల్ ఇండియా బ్యాంక్ రిటైరీస్ ఫెడరేషన్ ఆర్గనైజేషన్ సెక్రటరీ కష్ణమూర్తి వి వారణాసి, యూనియన్ బ్యాంక్ మాజీ చైర్మన్ ఎండి పి.శ్రీనివాస్, విజయ బ్యాంక్ మాజీ చైర్మన్ ఎండి బి.ఎస్.రామారావు, ఆంధ్రప్రదేశ్ బ్యాంక్ రిటైరీస్ ఫెడరేషన్ అధ్యక్షులు బివివి కొండలరావు, ప్రధాన కార్యదర్శి ఎ.ఎల్లారావు ప్రసంగించారు.

అన్ని దానాల కన్నా రక్తదానం మిన్న

సిబార్‌లో ప్రపంచ తలసేమియా డేలో జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి

ప్రజాశక్తి - పెదకాకాని

అన్ని దానాల కన్నా రక్తదానం మిన్న అని, అతి అరుదైన ప్రాణాంతక తలసేమియా రోగగ్రస్తులకు రక్తదానం చేయడం ఎంతో అభినందించదగ్గ విషయమని జిల్లా కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి తెలిపారు. వరల్డ్ తలసేమియా డే ' ను పురస్కరించుకుని పెదకాకాని మండలంలోని సిబార్ దంత వైద్య కళాశాలలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని గురువారం జిల్లా కలెక్టర్ ఎస్. నాగలక్ష్మి ప్రారంభించారు. సిబార్ దంత వైద్య కళాశాల డీన్ డాక్టర్ క్రిష్ణ ప్రసాద్ , అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ డాక్టర్. క్రిష్ణ మోహన్ , ప్రొఫెసర్ డాక్టర్ రేవతి తొలుత జిల్లా కలెక్టర్ ఎస్. నాగలక్ష్మి కి సిబార్ దంత వైద్య కళాశాలలోని పలు విభాగాలను చూపించి ప్రజలకు తక్కువ వైద్య ఖర్చులతో అందిస్తున్న దంత సంబంధమైన వైద్య విధానాన్ని , అత్యాధునిక ల్యాబ్ పరికరాలను వివరించారు. అలాగే ప్రపంచ తలసేమియా డే ను పురస్కరించుకుని కళాశాలలోని వంద మంది విద్యార్థిని , విద్యార్థులు మరియు కళాశాల అధ్యాపకులు గురువారం తలసేమియా రోగులకు రక్తాన్ని డొనేట్ చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్‌కు వివరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా కలెక్టర్ ఎస్. నాగలక్ష్మి మాట్లాడుతూ కాలేజీ విద్యార్థిని , విద్యార్థులు మరియు అధ్యాపకులు రక్తదానానికి ముందుకు రావడం అభినందించదగ్గ విషయమన్నారు. సిబార్ దంత వైద్య కళాశాల ఏర్పాటు చేసిన ఈ రక్తదాన శిబిరంలో పాల్గొనడం తనకు ఎంతో సంతోషాన్ని కలిగించిందన్నారు. ఉన్నతమైన ఆశయంతో రక్తదానాన్ని ఇవ్వడానికి ముందుకు వచ్చిన కళాశాల విద్యార్థిని , విద్యార్థులకు మరియు అధ్యాపకులను అభినందిస్తున్నానన్నారు. ఇలాంటి ఉన్నతమైన కార్యానికి రక్తదానాన్ని అందించడం వల్ల అత్యంత సంతృప్తి పొందినవారం అవుతామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్టీఆర్ భరోసా పథకం క్రింద తలసేమియా రోగులకు ప్రతి నెల రూ.పది వేల పెన్షన్ అందించడం జరుగు తున్నదని తెలిపారు. అలాగే ఎన్ జి ఓ లు కూడా తలసేమియా రోగులకు అనేక విధాలా సహాయ సహకారాలు అందిస్తున్నారని వివరించారు. ప్రపంచ స్థాయి అత్యాధునిక మౌళిక సదుపాయాలు కలిగిన సిబార్ దంత వైద్య కళాశాలలో చదువుతున్న విద్యార్థులు మరింతగా రాణించి వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ అభిలషించారు. సమాజానికి సేవలు అందించడం అనేది అత్యుత్తమైన అలవాటు అని, ఈ అంశాన్ని విద్యార్థులు ఆచరించేందుకు కృషి చేయాలని విద్యార్థులకు జిల్లా కలెక్టర్ తెలిపారు. అనంతరం రక్తదాన శిబిరాన్ని జిల్లా కలెక్టర్ ఎస్. నాగలక్ష్మి ప్రారంభించి రక్తాన్ని అందిస్తున్న విద్యార్థిని, విద్యార్థులకు పండ్లను పంపిణీ చేశారు. అనంతరం రక్తదానాన్ని అందిస్తున్న విద్యార్థిని , విద్యార్థులకు ఫ్యాకల్టీ అధ్యాపకులకు ప్రశంసా పత్రాలను అందించారు. కార్యక్రమంలో ఇన్ చార్జ్ డియం అండ్ హెచ్ ఓ డా. శ్రావణ బాబు, పెదకాకాని తహశీల్దార్ కృష్ణకాంత్ , సిబార్ దంత వైద్య కళాశాల విద్యార్థులు , ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేర నిర్ధారణలో ఫోరెన్సిక్ నిపుణుల పాత్ర కీలకం

పల్నాడు జిల్లా ఎస్‌పి కె.శ్రీనివాసరావు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ఫోరెన్సిక్ నిపుణులను సత్కరిస్తున్న ఎస్.పి

నేర నిర్దారణలో ఫోరెన్సిక్ సిబ్బంది పాత్ర కీలకమని క్షేత్ర స్థాయిలో ఆధారాల సేకరణలో కచ్చితత్వం పాటిస్తే ముద్దాయిలకు సులభంగా శిక్ష పడేందుకు అవకాశం ఉంటుందని తద్వారా నేరాలు చేయాలంటే భయపడే పరిస్థితి ఏర్పడుతుందని ఎస్.పి కె.శ్రీనివాసరావు అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో ఎస్.పి కె.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జిల్లా పోలీస్ అధికారులకు "ఫోరెన్సిక్ సాక్ష్యాల నిర్వహణ అనే అంశంపై "చర్చా వేదిక" కార్యక్రమం నిర్వహించారు. దర్యాప్తు ప్రక్రియకు ఉపకరించే అనేక మెళకువలతో పాటు కేసుకు సంబంధించి ఘటన జరిగిన ప్రదేశం నుండి న్యాయస్థానంలో కేసు విచారణకు వెళ్ళే వరకు పొందుపరచే ప్రతి ఆధారాన్ని భౌతికంగా, సాంకేతిక పరంగా ఏ విధంగా సేకరించాలనే విషయాలు, ఫోరెన్సిక్ సాక్ష్యాల నిర్వహణ, సాక్ష్యాల సేకరణ విధానాలు, గొలుసు పద్ధతిలో ఆధారాల అమరిక, దర్యాప్తులో చేయాల్సిన, చేయకూడని పనులు, అవలంభించాల్సిన అధునాతన సాంకేతిక విధానాలు తదితర అంశాలపై పోలీస్ అధికారులకు ఫోరెన్సిక్ నిపుణులు వివరించారు. ఈ సందర్భంగా ఎస్.పి కె.శ్రీనివాసరావు మాట్లాడుతూ డిజిపి హరీష్ కుమార్ గుప్తా, సౌత్ కోస్టల్ జోన్ ఐజి సర్వ శ్రేష్ట త్రిపాఠి ఆదేశాల మేరకు పోలీసు సిబ్బందికి ఇటువంటి అవగాహన సదస్సు ఏర్పాటు చేశామన్నారు. నిపుణులు సూచించిన మెళకువలను క్షేత్ర స్థాయిలో ఉపయోగించి కేసుల్లో ముద్దాయిలకు శిక్షలు పడే విధంగా సమగ్ర దర్యాప్తులు చేపట్టాలన్నారు. పోలీస్ స్టేషన్లలో నమోదయ్యే దొంగతనం, హత్య, అత్యాచారం, ఆత్మహత్య, చైన్ స్నాచింగ్, రోడ్డు ప్రమాదాలు, మాదక ద్రవ్యాలు, సామాజిక మాధ్యమాలు మొదలగు పలు విషయాలకు సంబంధించిన కేసుల్లో ఘటన జరిగిన ప్రదేశం నుండి న్యాయస్థానాలలో కేసుకు సంబంధించిన ఆధారాలు ప్రవేశపెట్టే వరకు ఉన్న అన్ని ఘట్టాలలో భౌతిక ఆధారాలు, ఆయుధాలు, వస్త్రాలు, ఘటన ప్రదేశంలో వేలి,కాలి ముద్రలు,రక్తపు మరకలు, సీసీటీవీ కెమెరా ఫుటేజ్ లు, వీడియో, ఆడియో రికార్డింగ్ లు, ఫోటోలు సేకరణ మొత్తం ప్రక్రియ ఏ విధంగా సేకరిస్తే వాటికి చట్టబద్ధత వస్తుందనే విషయాలపై అవగాహన కల్పించడం జరిగిందన్నారు. అనంతరం ఫోరెన్సిక్ సైంటిఫిక్ అధికారులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఫోరెన్సిక్ సైంటఫిక్ అధికారులు డి.కాంచన గోదర, ఎల్.స్వాతి కె.సురేంద్రబాబు, ఫోరెన్సిక్ అసిస్టెంట్ డైరెక్టర్లు బి. రామకష్ణారావు, పల్నాడు జిల్లా డి.ఎస్.పి లు, సిఐ లు, ఎస్.ఐ లు పాల్గొన్నారు.

దోషులకు శిక్ష పడేలా కృషి

గుంటూరు జిల్లా ఎస్‌పి సతీష్‌కుమార్

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

క్షేత్ర స్థాయిలో ఆధారాల సేకరణలో కచ్చితత్వం పాటిస్తే వివిధ కేసుల్లో నిందితులకు శిక్షలు పడే విధంగా కృషి చేయవచ్చునని జిల్లా ఎస్‌పి సతీష్ కుమార్ కోరారు. జిల్లా పోలీసు కార్యాలయంలో గురువారం ఫోరెన్సిక్ సాక్ష్యాల నిర్వహణపై జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలకు చెందిన పలువురు డిఎస్‌పిలు, సిఐలు, ఎస్‌ఐలు హాజరు అయ్యారు. దర్యాప్తు ప్రక్రియకు ఉపకరించే అనేక మెళకువలను పోలీస్ అధికారులకు ఫోరెన్సిక్ నిపుణులు వివరించారు. నిపుణులు అందించిన మెళకువలను క్షేత్ర స్థాయిలో ఉపయోగించి కేసుల్లో ముద్దాయిలకు శిక్షలు పడే విధంగా కృషి చేయాలని ఎస్‌పి అధికారులను కోరారు. ఏదైనా కేసుకు సంబంధించి ఘటన జరిగిన ప్రదేశం నుండి న్యాయస్థానంలో కేసు విచారణకు వెళ్ళే వరకు పొందుపరచే ప్రతి ఆధారాన్ని భౌతికంగా, సాంకేతిక పరంగా ఏ విధంగా సేకరించాలనే విషయాలను గురించి కూలంకషంగా వివరించిన ఫోరెన్సిక్ నిపుణులు వివరించారు. దొంగతనం, హత్య, అత్యాచారం, ఆత్మహత్య, చైన్ స్నాచింగ్,

రోడ్డు ప్రమాదాలు, మాదక ద్రవ్యాలు, సామాజిక మాధ్యమాలు మొదలగు పలు విషయాలకు సంబంధించిన కేసుల్లో ఘటన జరిగిన ప్రదేశం నుండి న్యాయస్థానాలో కేసుకు సంబంధించిన ఆధారాలు ప్రవేశపెట్టే వరకు వివిధ సాక్ష్యాలను నమోదు చేయాలన్నారు. భౌతిక ఆధారాలు అనగా ఆయుధాలు, వస్త్రాలు, పదార్థాలు వివిధ వస్తువులు ఉంటాయన్నారు. సాంకేతిక ఆధారాలు అనగా ఘటన ప్రదేశంలో వేలి,కాలి ముద్రలు,రక్తపు మరకలు, సీసీటీవీ కెమెరా ఫుటేజ్ లు, వీడియో, ఆడియో రికార్డింగ్ లు, ఫోటోలు వంటివి ఎలా సేకరించాలి? ఎలా భద్రపర్చాలో వివరించారు. అదనపు ఎస్‌పి రమణమూర్తి, ఫోరెన్సిక్ సైంటిఫిక్ అధికారులు రీనా సూనస్, సురేంద్రబాబు, వంశీకృష్ణ, సత్యరాజు, బి.నాగేంద్ర ప్రసాద్, జాఫర్ హుస్సేన్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ కోటేశ్వరరావు పాల్గొన్నారు.